

ఈ సారైనా ఇచ్చేరా..?

- గత ఏడాది జిల్లాకు మొండి చేయి
- నేడు కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గత ఏడాది కేంద్ర బడ్జెట్‌లో జిల్లాలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపింది. ఈ ఏడాది బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఈ సారైనా జిల్లాలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందేమో అని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు...

ఉమ్మడి కర్నూలు జిల్లాకు గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌లో మొండి చేయి దక్కింది. జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులకు ఒక్క పైసా కూడా నిధులను కేటాయించలేదు. వెనుకబడిన కర్నూలు జిల్లాలో రాష్ట్ర విభజన సందర్భంగా బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీని కేటాయిస్తామని హామీని నెరవేర లేదు. ఈ హామీని ప్రతి బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తూ వస్తుంది. కేంద్రీయ విద్యా సంస్థలు ట్రిపుల్ ఐటి డిఎం విద్యా సంస్థకు ఒక్క పైసా కూడా కేటాయించలేదు. హైదరాబాద్ టు బెంగళూరు పారిశ్రామిక కారిడార్ కింద ఓర్వకల్ పారిశ్రామిక వాడ ఏర్పాటుకు అనుమతి ఇచ్చినప్పటికీ ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ఇటువంటి చర్యలు మాత్రం తీసుకున్న దాఖలాలు లేవు. అనంతపురం టు అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే ఏర్పాటు గత ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తే ఇంతవరకూ ఆ ప్రాజెక్టు ముందుకు సాగడం లేదు. భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాం అని ప్రకటించినా కేంద్రం మాత్రం జాతీయ రహదారి విస్తరణ పనులకు మాత్రం ఎలాంటి నిధులు కేటాయించలేదు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా ఉమ్మడి కర్నూలు జిల్లాకు నిధులు ఏమైనా దక్కుతాయేమోనని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు.



రైల్వేపై చిన్నచూపు..

రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. పాత ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. కొత్త ప్రాజెక్టులను మంజూరు చేయడం లేదు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకూ రైలు ఉన్నప్పటికీ అది రెండు రోజులకు ఒకసారి నడుస్తోంది. దాన్ని రోజూ నడపాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. కాచిగూడ నుంచి గుంటూరుకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడ వరకూ పొడిగించాలని ప్రజల నుంచి డిమాండ్ వ్యక్తం అవుతోంది. కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లాలంటే డోన్ మీదుగా వెళ్లాల్సి వస్తుండటంతో సమయం ఎక్కువ పడుతోంది. కర్నూలు నుంచి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాలకు కొత్తగా రైల్వే లైన్ వేస్తే ప్రయాణ సమయం తగ్గిపోనుంది. వాటితో పాటు జిల్లాలోని పుణ్యక్షేత్రాలను కలిపేలా మంత్రాలయం – కర్నూలు – శ్రీశైలం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది.

సాగని కోచ్ ఫ్యాక్టరీ...

కర్నూలు సమీపంలో ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్ తయారీ ఫ్యాక్టరీ పనులు ముందుకు సాగడం లేదు. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని ఆలంపూర్ రోడ్లు, కర్నూలు జిల్లా పరిధిలోని ఇ.తాండ్రపాడు, పంచలింగాల పరిధిలో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.562 కోట్లతో 123 ఎకరాల్లో దాని ఏర్పాటు పనులను ప్రారంభించారు. 2020–21 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రూ.30 కోట్లను దాని కోసం కేటాయించింది. ఈ ఏడాది రూ.58 కోట్లను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించారు. అవసరమైన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఈ రైల్వే కోచ్ ఫాక్టరీ పనులు ముందుకు సాగడం లేదు. కేవలం షెడ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఈ ఫ్యాక్టరీ పూర్తయితే నెలకు 50 రైల్ కోచ్‌లను తయారు చేసే అవకాశం ఉంటుంది. ఆ ఫ్యాక్టరీ వల్ల వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

ట్రిపుల్ ఐటి డిఎంకు నిధులు కరువు..

రాష్ట్ర విభజన అనంతరం జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్ ఐటి డిఎం విద్యాసంస్థను ప్రకటించింది. 2015 నుండి కాంచీపురంలోని విద్యాసంస్థలో మూడేళ్లపాటు తరగతులను నిర్వహించారు. కర్నూలు నగర శివారులోని జగన్నాథ గట్టు సమీపంలో 150 ఎకరాలను కేటాయించారు. రూ.350 కోట్లను ప్రకటించగా భవన నిర్మాణాల కోసం రూ.35 కోట్లను మాత్రమే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2018లో జగన్నాథ గట్టు సమీపంలోనే తరగతులను ప్రారంభించారు. మొదట కేవలం తరగతుల నిర్వాహణకు అవసరమైన భవనాలను పూర్తి చేశారు. గత విద్యా సంవత్సరం నుండి హాస్టల్ భవనాలను పూర్తి చేసి సొంతంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ విద్యార్థులకు అవసరమైన భవనాలు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పరిశోధనాత్మక కోర్సులను కూడా అభ్యసించేందుకు అవసరమైన సౌకర్యాలూ కరువయ్యాయి.



ఎండోమెంట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఆలయ భూముల్లో అక్రమాలను అరికట్టాలి

- ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఓర్వకల్లు మండలం శకునాల గ్రామ శ్రీ కాశీరామేశ్వరస్వామి భూములలో అక్రమంగా తవ్వకాలు నిర్వహించిన కాంట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం శకునాల గ్రామ ప్రజలు కర్నూలు ఎండోమెంట్ ఆఫీస్ ముందు అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ కార్యాలయం ముందు రైతు సంఘం మండల కార్యదర్శి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ధర్నా చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న, సిఐటియు మండల అధ్యక్షులు జి. శ్రీధర్ మాట్లాడుతూ శకునాల గ్రామంలోని సర్వేనెంబర్ 155 – 163 లో 18 ఎకరాల శ్రీ కాశీ రామేశ్వరస్వామి భూముల్లో కాంట్రాక్టర్లు ఎథేచ్ఛగా మట్టిని తవ్వి సోలార్ పరిశ్రమకు వెంచర్లకు అమ్ముతుంటే అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని వివరించారు. అనేకసార్లు గ్రామస్తులు గ్రామ మండల అధికారులకు కలెక్టర్‌కు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. 18 ఎకరాల భూమిని రెండు సంవత్సరాల కాలంలో పది అడుగులకు పైగానే తవ్వేశారంటే ప్రజాధనాన్ని ఏ విధంగా కొల్లగొట్టారో అర్థమవుతుందని అన్నారు. గతంలో ఆ భూములను సాగు చేసి వచ్చిన డబ్బుతో శ్రీ కాశీ రామేశ్వర స్వామి పూజ పునస్కారాలు ఇతర ఖర్చులకు ఉపయోగించే వారిని, అలాంటి భూములను సాగుకు పనికి రాకుండా చేయడం దారుణమని అన్నారు. కలెక్టర్ గత వారం క్రిందట ఎండోమెంట్ అధికారికి ఆదేశాలు ఇచ్చినా ఇదిగో అదిగో అంటూ రోజులు గడుస్తున్నాయి తప్ప సమస్య పరిష్కారమయ్యే దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఎండోమెంట్ అధికారి మట్టిని తవ్వేసిన కాంట్రాక్టర్ల పైన చర్యలు తీసుకుని ఆ భూములను సాగు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎండోమెంట్ అధికారికి వినతి పత్రం అందజేశారు. రెండు రోజుల్లో దేవాలయం భూములను పరిశీలించి బాధ్యులపై చర్యలు చేపడతానని ఎండోమెంట్ అధికారి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శివుడు, మనోహర్ చంద్ర,సూర్యనారాయణ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

3న ధర్మస్థలిలో సంకల్ప దీక్ష : యుటిఎఫ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 3న ధర్మస్థల సంకల్ప దీక్ష నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్. జిల్లా ప్రధాన కార్యదర్శి జయరాజు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సిపిఎస్ రద్దుకు సంబంధించి చేపడుతున్న ధర్మస్థలి సంకల్ప దీక్ష పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో కె. సురేష్‌కుమార్, జయరాజు మాట్లాడుతూ ఉద్యోగులు ఉపాధ్యాయుల జీవిత భద్రతకు ముప్పుగా పరిరక్షిస్తున్న కాంట్రిబ్యూట్ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తారని ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేర్చ లేదన్నారు. ఇప్పుడు మరో కొత్త పెన్షన్ విధానాన్ని జిపిఎస్ విధానాన్ని అమలు చేస్తానని ప్రతిపాదించడం ఉద్యోగులు ఉపాధ్యాయుల ఆమోదయోగ్యం కాదని పాత పెన్షన్ విధానమే అమలు చేయాలన్నారు. ఈ నేపథ్యంలో గ్యారేంటెడ్ పెన్షన్ విధానం ఆలోచన విరమించుకోవాలన్నారు. కృష్ణాజిల్లా గన్నవరం సమీపంలో ధర్మస్థలి ప్రాంగణంలో సంకల్ప దీక్ష సభను నిర్వహించారు. ఈ సంకల్ప దీక్షకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. జిల్లా సహాధ్యక్షులు రవికుమార్ జిల్లా జిల్లా గౌరవ అధ్యక్షులు మారెప్ప ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్, ఆడిట్ కన్వీనర్ మద్దిలేటి, రాష్ట్ర కౌన్సిలర్ యెహోషువ, రంగన్న పాల్గొన్నారు.

వలసల నియంత్రణకు ప్రణాళిక ఏది?

- పశ్చిమంలో వలసలపై అధ్యయనాలు-లక్ష మందికి పైగా కూలీలు వలసబాట
- వలసలు నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నిరుపేద వ్యవసాయ కూలీల వలసలను అడ్డుకట్ట వేయడంలో పాలకులు ఎలాంటి ప్రణాళికలను రూపొందించడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతం నుండి వలసలు పెరగడానికి గల కారణాలను ఇటీవల కాలంలో అటు ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు అధ్యయనాలు చేయడం మొదలుపెట్టాయి. ఉపాధి హామీ పథకం ఉన్నప్పటికీ కూలీలు మాత్రం పనులకు అంతంత మాత్రంగానే వస్తున్నారు. కర్నూలు జిల్లాలో పశ్చిమ ప్రాంతం కరువు ప్రాంతంగా పేరుగాంచింది. జిల్లాలో మొత్తం 481 గ్రామ పంచాయతీలు ఉండగా 3.47 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. 6.95 లక్షల మంది వ్యవసాయ కూలీలు ఉన్నట్లు అధికార గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జనవరి మాసంలో ఉపాధి హామీ పనులకు లక్ష మంది కూలీలకు పనులు కల్పించాలని ఆ శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో ఉపాధి పనులకు కేవలం 53,000 మంది పైగా వ్యవసాయ కూలీలు రోజువారిగా పనులకు వస్తున్నారు. జిల్లాలోని పథకం కింద కూలీలకు రూ.210 లు మాత్రమే అందుతున్నట్లు అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే కర్నూలు జిల్లా నుండి వేరే ప్రాంతాలకు సుమారు లక్ష మందికి పైగానే కూలీలు వలస బాట పట్టారు. ఉపాధి పనులకు ప్రభుత్వం చెల్లిస్తున్న కూలీ సరిపోకపోవడంతో వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఈ ప్రాంతంలో పేదరికంతో గ్రామీణ నిరుపేద వ్యవసాయ కూలీలు అల్లాడుతున్నారు. పేదరిక నిర్మూలనకు పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదోని ఏరియా డెవప్‌మెంట్ అథారిటీ పేరుతో ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసింది. ఈ బోర్డుకు పూర్తిస్థాయిలో ఎలాంటి విధివిధానాలు , నిధుల కేటాయింపు చేయకుండానే ప్రభుత్వం వదిలేసింది. ఈ ప్రాంతంలో కూలీల వలసల బాటపై గత కొన్ని రోజులుగా అధ్యయనాలు చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన రీసెర్చ్ ఫర్ సోషల్ స్టడీస్ హైదరాబాద్‌కు చెందిన సంస్థ ద్వారా ఇక్కడ వలసలు , వెనుకబాటు తనంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. ఇక్కడి గ్రామీణ ప్రాంతంలో పేదరికంతోనే వ్యవసాయ కూలీలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇక్కడ ఉన్నటువంటి వ్యవసాయ భూములు సాగునీటికి సౌకర్యం లేకపోవడం మూలంగానే వ్యవసాయ పనులు లేక పిల్లాపాపలతో కుటుంబాలు వలసలు వెళ్తున్నాయి. వ్యవసాయ కార్మిక సంఘం కూడా ఈ ప్రాంతంలోని వలసలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి ప్రభుత్వానికి, అటు ఉన్నతాధికారులకు నివేదించింది. ఇటీవల మరో సంస్థ కూడా వ్యవసాయ కూలీల వలసలపై అధ్యయనం చేసింది. ఈ ప్రాంతంలో పేదరిక నిర్మూలన చర్యలు తీసుకోవడమే కాకుండా ఉపాధి కూలీలకు చెల్లిస్తున్న కూలి రేట్లు కూడా పెంచడమే దీనికి శాశ్వత పరిష్కారమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి నారాయణ పేర్కొన్నారు. వంద రోజుల నుండి పని దినాలను 200 రోజులకు పెంచాలని, దినసరి వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వలసల నివారణ పై గ్రామ సభ ద్వారా అవగాహన
- అమర్‌నాథ్ రెడ్డి, డ్వామా పీడీ

జిల్లాలో ఉపాధి కూలీలు వలసలు వెళ్లకుండా అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ అధికారులతో పాటు జిల్లా స్థాయి అధికారులతో గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఇక్కడే ఉపాధి పనులకు హాజరు కావాలి. ఉపాధి కూలీల వలసల నివారణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించుకుని ముందుకు వెళ్తున్నాం.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు




మహేశ్వరయ్య స్మారక సాహిత్య పురస్కార కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా కెంగార మోహన్, అయ్యన్న

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

సాహితీ స్రవంతి కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శిగా విశిష్ట సేవలందించి, కవిగా, కథకుడుగా ఆధునిక తెలుగు సాహిత్య వికాసానికి కృషి చేసిన తెలుగు ఉపాధ్యాయుడు సంకటి మహేశ్వరయ్య స్మారకార్థం ప్రవేశపెట్టిన మహేశ్వరయ్య స్మారక సాహిత్యపురస్కారం–2022 అధ్యక్షకార్యదర్శులుగా సంఘం నాయకులు కెంగారమోహన్‌ను అయ్యన్నను ఎన్నుకున్నట్లు సాహితీస్రవంతి జిల్లా ప్రధానకార్యదర్శి ఆవులబసప్ప తెలిపారు. ఆధునిక సాహిత్యానికి ముఖ్యంగా సాహితీ స్రవంతికి చేసిన సేవలను గుర్తించి అతడి పేరుతో ప్రతి ఏడు మహేశ్వరయ్య స్మారక సాహిత్య పురస్కారాన్ని సాహితీ స్రవంతి జిల్లా కమిటీ ఇస్తుందన్నారు. కోశాధికారిగా ఆవుల చక్రపాణి యాదవ్‌ను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా సాహితీస్రవంతి రాష్ట్రకార్యదర్శి జంధ్యాల రఘుబాబు, ప్రముఖకవి సాహిత్యప్రకాశ్‌ను ఎన్నుకున్నామన్నారు. 2022 జనవరి నుండి 2022 డిసెంబర్ మాసం వరకు ప్రచురితమైన ఇరు రాష్ట్రాల్లోని కథాసంపుటాలను ఆహ్వానిస్తున్నామని, 2022 పురస్కారాన్ని 2023 ఏప్రిల్ 27న ప్రదానం చేయనున్నారు. త్వరలో కమిటీ సమావేశమై పురస్కార కమిటీ విధివిధానాలు ప్రకటిస్తుందన్నారు.

బిసిలను నిరాశపరచిన జగనన్న చేదోడు : టిడిపి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న జగనన్న చేదోడు పథకం బిసిలను నిరాశకు గురి చేసిందని టిడిపి బిసి సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ వేంపేటరాంబాబు విమర్శించారు. మంగళవారం కర్నూలు చెన్నమ్మ సర్కిల్‌లోని టిడిపి కార్యాలయంలో టిడిపి బిసి సాధికార కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగనన్న చెదోడు పథకంలో బిసి లకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. జిల్లాలో రజకులు కుల వృత్తిపై ఆధారపడి దాదాపు నలభై వేల మంది జీవనం కొనసాగిస్తున్నారని, వారిలో జగనన్న చేదోడు పథకానికి జిల్లాలో ఇరవైవేల మంది దరఖాస్తు చేసుకుంటే వివిధ నిబంధనలు పెట్టి 3650 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నాయీబ్రాహ్మనులు 15 వేల మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 2600 మందికి, దర్జీలు 15000 మంది దరఖాస్తు చేసుకుంటే కంటితుడుపు చర్యగా తూతూ మంత్రంగా లబ్ధిదారులను ఎంపిక చేశారని తెలిపారు. బిసిలను బిచ్చగాళ్లుగా జగన్ ప్రభుత్వం తయారుచేసిందన్నారు. పేరుకు మాత్రమే బిసిలంటే బ్యాక్ బోన్ అంటూ బిసిలను వైసిపి ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. బిసిలకు న్యాయం జరగాలంటే చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. టిడిపి జిల్లా కార్యదర్శి కేతురిమధు, టైలర్ అసోసియేషన్ కార్యదర్శి సి.నాగరాజు, బెస్త సాధికార కమిటీ అధ్యక్షులు పుట్టగురు వెంకటేష్, టిడిపి నాయకులు రవిరెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, మైనారిటీ నాయకులు సులేమాన్ పాల్గొన్నారు.

ప్రజాసేవకు అంకితం నాజీవితం

జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్


ప్రజలకు సేవచేయడానికే నాజీవితం అంకితమని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ.హాఫీజ్‌ఖాన్ అన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ జన్మదిన వేడుకలను మంగళవారం వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు వృద్ధాశ్రమాలు నిరాశ్రయుల కేంద్రాలలో ఆసుపత్రుల్లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అందులో భాగంగా అన్నదానాలు, వస్త్ర దానాలు, పండ్లు, పుస్తకాలు, పెన్నులు, వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆంజనేయులు వారి బృందం ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఇందిరా గాంధీ నగర్‌లోని వద్ధాశ్రమంలో రాజేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అక్కడే కేక్ కట్ చేశారు. 1వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో వార్డు కార్పొరేటర్ శాశావలి ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. 10వ వార్డు కార్పొరేటర్ యూనూస్ బాష ఆధ్వర్యంలో మాసూమ్ బాషా దర్గాలో ఉచిత మేగా హెల్త్ క్యాంపు "ఐ" చెకప్ సేవలు, పిల్లలకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సి.క్యాంపులోని ప్రభుత్వ వికలాంగుల బాలుర వసతిగృహంలో ఘనంగా జన్మదిన వేడుకలు, అన్నదానం కార్యక్రమం ప్రారంభించి కేక్ కటింగ్ చేశారు. వికలాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ చేశారు. కర్నూలు నగరంలోని కృప ఓల్డ్ ఏజ్‌హోమ్, సరూర్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో నల్లారెడ్డి ఫౌండేషన్ అధ్యక్షులు కేదార్నాథ్ ఆధ్వర్యంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వృద్ధుల మధ్య జన్మదిన వేడుకలను నిర్వహించి కేక్ కట్ చేశారు. పేద మహిళలకు చీరలు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. పేదలకు సేవ చేయడంలో తాను ఎప్పుడూ ముందుంటానన్నారు. కర్నూలు నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పేదలకు సహాయం చేయడంలో ప్రతి ఒక్కరు ముందుండాలన్నారు. వైసిపి నగర అధ్యక్షురాలు సత్యానారాయణమ్మ, ఎస్‌సి సెల్ నాయకులు రైల్వే ప్రసాద్, నాయకులు డిష్ రాజు, అనిల్, చిన్నబాబు, ఆదినారాయణ రెడ్డి, మోయిన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పేదమహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

క్రీడలు నిత్య జీవితంలో భాగం కావాలి : టిజి భరత్

రాష్ట్ర ఎస్‌జిఎఫ్ అండర్ 14 రగ్బీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- కర్నూలు స్పోర్ట్స్ : క్రీడలుప్రతి ఒక్కరికి నిరంతర జీవనంలో ఒక భాగం కావాలని రాష్ట్ర రగ్బీ సంఘం అధ్యక్షులు టిజి.భరత్ అన్నారు. నగర శివారులోని ఆదర్శ విద్యా మందిరంలో మంగళవారం రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 బాల బాలికల రగ్బీ పోటీల ప్రారంభోత్సవంతో ముఖ్య అతిథులుగా డిఇఒ డాక్టర్ వి రంగారెడ్డి , టిజి భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిజి. మాట్లాడుతూ.. సమాజంలో క్రీడాకారులకు ఎంతో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కర్నూలు జట్లు చక్కని ప్రతిభతో గెలుపు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. దీనికి కృషిచేసిన వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ పోటీలు సజావుగా నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఇతర క్రీడల కన్నా రగ్బీ క్రీడకు ఎన్నో నైపుణ్యతలు ఉండాలన్నారు. రగ్బీ క్రీడకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో సుదూర ప్రాంతం నుంచి వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారుల తల్లిదండ్రులు వారి పిల్లలను ఈ పోటీలలో పాల్గొనేందుకు చేస్తున్న కృషిని ప్రశంసించారు. అంతకుముందు వివిధ జిల్లాలకు చెందినక్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మిలిటరీ కాలనీ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జోసఫ్ లక్ష్మయ్య, రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీల పరిశీలకులు రవి ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర రగ్బీ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, అడ్వయిజర్ విజయ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వెంకట్రాముడు, కృష్ణ, శేఖర్, సిరాజ్, రాజశేఖర్, ఎంఎండి.బాషా, మహిళా వ్యాయామ ఉపాధ్యాయులు శ్రేయ శ్రీ, శారద, పద్మావతి, దోర్థి, జయమ్మ, జ్యోతి, విజయ లక్ష్మి పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ప్రారంభంలో పాల్గొన్న డిఇఒ రంగారెడ్డి, టిజి.భరత్ తదితరులు

రోడ్డు విస్తరణ వెంటనే చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పత్తికొండలో నాలుగు స్తంభాల కూడలి దగ్గర సిపిఎం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షను చేపట్టారు. దీక్షలో సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి మండల కమిటీ సభ్యులు గంగన్న. మధుబాబు, తాజ్ మహమ్మద్, రాముడు రాజశేఖర్ కూర్చున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పత్తికొండలో జనాభా పెరగడంతో రోడ్లలో ట్రాఫిక్ సమస్యతో తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు పత్తికొండకు అవసరాల నిత్యం వస్తూపోతూ ఉంటారని, ఇరుకు రోడ్లు కావడంతో వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయని గుర్తు చేశారు. కాబట్టి వెంటనే రోడ్డు విస్తరణ చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాసంఘాలు కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.




దీక్షలో రంగారెడ్డి, ఇతర నాయకులు

బిల్లులు రాక..కూలీలకు ఇవ్వలేక...

ప్రజాశక్తి -సి బెళగల్

సి బెళగల్ పంచాయతీలో చేసిన పనులకు బిల్లులు రాక, పలు పనులకు కూలీలు ఇవ్వలేక బెళగల్ సర్పంచి పాండురంగన్న ఆయా లీకేజి పనులకు గడ్డపార పట్టారు. వైసిపి సర్పంచిగా ఎన్నికైన నాటి నుండి పంచాయతీ నిధులు రూ.20 లక్షలు రావాలని, పైప్ లైన్ పనులకు రూ.7 లక్షలు రావాలని, ఇప్పటికే చాలా రోజులు గడిచాయని నష్టాల పాలయినట్లు ఆయన మీడియాలో వాపోయారు. అందుకే సోమవారం, మంగళవారం సి బెళగల్‌లో గల పలుకుదొడ్డి క్రాస్ రోడ్డులో, మాల, బోయ వీధిలో నెలలుగా లీకేజితో ఇబ్బంది ప్రజలకు ఏకంగా గడ్డపార పట్టి పనులను సాగించారు.



పోలకల్‌లో శనగ పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి -సి బెళగల్

మండలంలోని పోలకల్‌లో ఎఒ మల్లేష్ కుమార్ మంగళవారం శనగ పంట కోత ప్రయోగం చేశారు. కొలతల ప్రకారం ప్రామాణికంగా 5 కేజీల 330 గ్రాములు దిగుబడి వచ్చిందన్నారు. దీని ప్రకారం ఎకరాకు 8 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కో ఆర్డినేటర్ ముస్తాక్, ఎంపిఇఒ వెంకటేశ్వర్లు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పంటకోత ప్రయోగంలో ఎఒ తదితరులు

మిరప రైతులను ఆదుకోవాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

అధిక వర్షాలతో మిరప పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో మండలంలో దాదాపు 12 వేల ఎకరాల్లో మిరప పంటను సాగు చేశారని తెలిపారు. అధిక వర్షాలు, తామర పురుగు వల్ల మిరప పంట పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయారని చెప్పారు. ఎకరాకు కనీసం ఒక కింటా కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రతి ఎకరాకూ 15 నుంచి 20 కింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండని చెప్పారు. ఎకరాకు దాదాపు రూ.లక్ష పెట్టుబడి పెట్టినా రూ.20 వేలు కూడా రావడం లేదన్నారు. రైతులు అప్పుల పాలై కొంతమంది వలసలు పోతే, మరి కొంతమంది పొలాలను అమ్ముకోవడం, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బీమా పరిహారం అందించి మిరప రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే గతేడాది పెండింగ్‌లో ఉన్న బీమా పరిహారాన్ని కూడా రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, అధ్యక్షులు శేఖర్, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి లింగన్న, మండల కార్యదర్శి వీరారెడ్డి, కెవిపిఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప, రైతు సంఘం నాయకులు మునిస్వామి, రవి, హనుమంతు రెడ్డి, ఏలియా, బాష, రామలింగప్ప, రైతులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉగాదికి టిడ్కో ఇళ్ల అప్పగింత

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి
- పరిసరాల పరిశీలన

ప్రజాశక్తి - ఆదోని

టిడ్కో గృహ సముదాయంలో మౌలిక సదుపాయాలు కల్పించి ఉగాదికి లబ్ధిదారులకు అప్పగిస్తామని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆదోని పట్టణ శివారులోని సిరుగుప్ప రోడ్డులో ఉన్న హౌసింగ్ సముదాయాన్ని పరిశీలించారు. తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఇళ్లల్లో చేరేందుకు ముందుకు రావడం లేదని కొందరు లబ్ధిదారులు వారి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 4 వేల గృహ సముదాయంలో 200 గృహాలు సిద్ధం చేశామని తెలిపారు. రూ.1850 విద్యుత్ కనెక్షన్‌కు ఉండడం వల్ల పేదలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని గ్రహించామని చెప్పారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి రూ.450 కనెక్షన్ కోసం చెల్లించే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. వర్షాభావం, బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి టిడ్కో గృహ సముదాయానికి పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరాకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని తెలిపారు. అక్కడక్కడ వాల్ మాత్రమే ఏర్పాటు చేయాల్సి ఉందని, ఆ పనులు కూడా త్వరలోనే పూర్తి చేయిస్తామని చెప్పారు. టిడ్కో గృహ సముదాయంలో చేరే లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వంట గ్యాస్ కనెక్షన్ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం ఉండేలా చూస్తామన్నారు. నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా మినీ రైతు బజారు ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆధునిక వసతులతో ఇళ్ల నిర్మాణం జరిగిందని, లబ్ధిదారులు ఎలాంటి అపోహలూ పెట్టుకోవద్దని సూచించారు. త్వరలోనే అన్ని సౌకర్యాలూ కల్పించి ఉగాదికి గృహ ప్రవేశం జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 200 మంది లబ్ధిదారులు ముందుకొచ్చారని, వారికి తాళాలు అప్పగిస్తామని తెలిపారు. టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్, మెప్మా ఆఫీసర్ వీరారెడ్డి, అధికారులు ఉన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు

ఆదోనిరూరల్ : ప్రజలకు అందుబాటులో ఉండి సచివాలయం ద్వారా మెరుగైన సేవలు అందించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మండలంలోని పెద్దహరివాణం గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. మూవ్‌మెంట్ రిజిస్టర్, హాజరు పట్టిక, వివిధ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కార్యాలయం ఆవరణలోని బాత్‌రూమును తనిఖీ చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

మండలంలోని పెద్దహరివాణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి రిజిస్టర్, హాజరు పట్టిక, ఫార్మా రికార్డులను తనిఖీ చేశారు. వైద్యులు అందుబాటులో ఉండడం లేదని స్పందనలో అర్జీలు వస్తున్నాయని, వైద్యులు గమనించి సమయపాలన పాటించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రిని పరిశీలించారు. డాక్టర్ ఇమ్రాన్, పంచాయతీ కార్యదర్శులు నాగరాజ్, షేక్ అహ్మద్, గ్రామ రెవెన్యూ అధికారి మహేంద్ర పాల్గొన్నారు.



పాఠశాలను తనిఖీ చేస్తున్న జిసిడిఒ సునీత

ఇష్టంతో చదివితేనే మంచి మార్కులు : జిసిడిఒ సునీత

ప్రజాశక్తి - చిప్పగిరి

విద్యార్థులు ఇష్టంతో చదివితేనే మంచి మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుందని కర్నూలు జిసిడిఒ సునీత సూచించారు. మంగళవారం చిప్పగిరిలోని కస్తూరిబా పాఠశాలను సునీత, వారి సిబ్బంది ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నారా లేదా బాలికలను అడిగి తెలుసుకున్నారు. వసతులపై బాలికలతో పాటు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. కష్టపడి చదివితేనే ఉన్నత చదువుల్లో మంచి ర్యాంకులు సాధించి భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహాలు ఇస్తోందని చెప్పారు. బాలికలకు అన్ని వసతులూ ఉన్నందున ప్రిన్సిపల్ షబానాను అభినందించారు. బాలికల ఆరోగ్య రీత్యా జాగ్రత్తగా చూసుకోవాలని ప్రిన్సిపల్ షబానాకు సూచించారు. ఆలేసుకో, గోపీనాథ్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

'శ్రీబాలాజీ' విద్యార్థికి వెండి పతకం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని శ్రీబాలాజీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి పి.మహిమ స్వరూప్ ఇటీవల తిరుపతిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి వెండి పతకం సాధించినట్లు డాక్టర్ జ్యోతిర్మయి, విద్యాసంస్థల అధినేత కెఎస్.మురళీ బాబు తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థిని, తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు కె.సురేంద్రను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ హనుమంతు పాల్గొన్నారు.

కబడ్డీలో ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని పెద్దనేలటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని హేమలత కబడ్డీ పోటీల్లో రాణించడంతో మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఇటీవల విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జట్టు ద్వితీయ స్థానంలో నిలిచేందుకు హేమలత కృషి చేశారు. గ్రామస్తులు, సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ కె.పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థిని హేమలతతో పాటు ఆమెను ఈ స్థాయిలో తీర్చిదిద్దిన పాఠశాల పీడీ రసూల్‌బీని పూలమాల, శాలువాతో సన్మానించారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి గ్రామానికి, పాఠశాలకు పేరు తేవడం అభినందనీయమని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్న హుస్సేన్, ఉపాధ్యాయులు రమేష్, రవి, బషీర్, నాగ మునీంద్ర, చంద్రశేఖర్, రాజేశ్వరి పాల్గొన్నారు.

నిబంధనకు విరుద్ధంగా విక్రయిస్తే చర్యలు

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఛైర్మన్

మెడికల్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారి పట్ల అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో డ్రగ్ కంట్రోల్ కార్యాలయాన్ని అధికారి మురళీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బి.శాంత ప్రారంభించారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని మెడికల్ షాపుల్లో కొందరు అధిక ధరలకు మందులు విక్రయిస్తూ మోసం చేస్తున్నారని జర్నలిస్టులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అధికారులు సక్రమంగా విధులు నిర్వర్తించకపోవడం వల్ల మోసాలకు అదుపు లేకుండా పోయిందని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రయివేట్ రూముల్లో కార్యాలయ నిర్వాణ ఉండడం వల్ల అధికారుల పనితీరు తెలియడం లేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రి ఆవరణలోనే కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల సక్రమంగా విధులకు హాజరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవకతవకలకు అనుమానం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాంటి వారిపై తనిఖీలు నిర్వహించి సంబంధిత వ్యక్తి మెడికల్ షాపును సీజ్ చేస్తామని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మురళీ తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న, నాయకులు కామాక్షి తిమ్మప్ప, దేవా, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్, కార్యవర్గం ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్, ఫక్కీరయ్య ఉన్నారు.

సంకల్ప దీక్షను జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-ఆలూరు

పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టే సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని యుటిఎఫ్ నాయకులు, ప్రధానోపాధ్యాయులు కరిబసప్ప, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గోవిందప్ప, ఖాసీం, బసవరాజు కోరారు. మంగళవారం ఎంఆర్‌సి ఆవరణలో సంకల్ప దీక్ష కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసిందన్నారు. మూడేళ్లుగా ఉపాధ్యాయులను, ఉద్యోగులను మానసికంగా, శారీరకంగా హింసిస్తోందని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించి సిపిఎస్, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈనెల 3న కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలో సుందరయ్య విద్యానగర్‌లో ధర్మస్థలి ఆవరణలో చేపట్టే సంకల్ప దీక్షలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యుటిఎఫ్ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యుటిఎఫ్ నాయకులు సురేష్, షేక్షారావు, మంగయ్య, పార్థసారధి, మధు, రంగనాథ్, బాలేశ్వర నాయక్, గోవిందు, ముర్తుజావలీ, రమణారెడ్డి, రంగస్వామి పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

దుర్వాసన నుంచి విముక్తి కల్పించండి

- జీర్ జీర్ బండ వంక కాజ్ వే ఎత్తు పెంచి నిర్మించాలి
- టిడిపి నేత కదిరికోట ఆదెన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో కలుగొట్ల రోడ్డులో గల డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాలనీ వాసులకు జీర్ జీర్ బండ వంక నుంచి వస్తున్న దుర్వాసన నుంచి విముక్తి కల్పించాలని టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న డిమాండ్ చేశారు. మంగళవారం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాలనీ వాసులతో కలిసి జీర్ జీర్ బండ వంక కాజ్‌వే దగ్గరకు చేరుకొని నిలిచిపోయిన వ్యర్థ పదార్థాలను, దుర్గంధాన్ని, చనిపోయిన జంతువుల కళేబరాలను పరిశీలించారు. జంతువుల కళేబరాలను, వ్యర్థ పదార్థాలను తొలగించాలని అక్కడి నుంచి మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ ద్వారా ఆదెన్న కోరారు. కమిషనర్ స్పందించి... సచివాలయ అధికారులను పంపించి తొలగించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆదెన్న మాట్లాడారు. జీర్ జీర్ బండ వంక కాజ్ వే తక్కువ ఎత్తుతో ఉండడం, పట్టణానికి ప్రధాన వంకగా ఉండడం వల్ల పట్టణంలోని వ్యర్థ పదార్థాలు, జంతువుల కళేబరాలు అన్నీ ఇక్కడ నిలిచిపోతుండడంతో దుర్గంధం వెదజల్లుతోందని తెలిపారు. జగ్జీవన్ రామ్ కాలనీ వాసులు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వంకకు ఇరువైపులా కాలువ నిర్మాణంతో పాటు వంక కాజ్ వేను ఎత్తులో నిర్మించాలని కోరారు. సమస్యపై కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. టిడిపి నాయకులు, రోజా ఆర్ఫ్ హుస్సేని, దర్జీ మోషన్న, కంపాడు చిన్న రంగన్న, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాలనీ కమిటీ అధ్యక్షులు డి.సంజీవ్, కాలనీవాసులు ఎం.చెన్నప్ప, ఎం.నాగరాజు, జె.జయపాల్, పోస్ట్ మ్యాన్ డేవిడ్, ఎం.హేజ్కేల్, జె.మహేష్, పెయింటర్ అశోక్, ఎం.డేవిడ్, బి.శాంతి రాజు పాల్గొన్నారు.



కాలనీవాసులతో కలిసి పరిశీలిస్తున్న ఆదెన్న



వికలాంగులకు వాహనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వికలాంగులకు మోటార్ బైక్స్ పంపిణీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మోటార్ వాహనాల పథకం కింద నియోజకవర్గానికి చెందిన వికలాంగులకు మొదటి విడతలో మోటార్ వాహనాలను ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అందరికీ అండగా ఉంటుందని తెలిపారు. సిఆర్‌పిఎఫ్ జిల్లా కన్వీనర్ లింగన్న మాట్లాడుతూ... తాము ఎక్కడికి వెళ్లాలన్నా సొంతంగా వెళ్లడానికి వీలుంటుందని తెలిపారు. వికలాంగులకు అండగా నిలిచిన ప్రభుత్వానికి మరింత అండగా ఉంటామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డికి వికలాంగులు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్ అహ్మద్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ముగతి విరుపాక్షిరెడ్డి, ఉరుకుంద రెడ్డి, ఈరన్న పాల్గొన్నారు.

జామియా మసీదు భూముల పరిశీలన

పట్టణానికి చెందిన జామీయ మసీదు భూములను ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి పరిశీలించారు. అధికారులతో కలిసి భూములను పరిశీలించి, ఆక్రమణకు గురి కాకుండా తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. స్థలం పరిశీలనతో పాటు రికార్డులను పరిశీలించారు. సుధాకర్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, కమిషనర్ ఎన్.గంగిరెడ్డి, తహశీల్దార్ జయన్న, పట్టణ సిఐ మధుసూదన్, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్ అహ్మద్, జామీయ మసీదు కమిటీ అధ్యక్షులు కాశీం బేగ్, ఉమర్ సాబ్, సభ్యులు వాహీద్, వహాబ్, షాబుద్దీన్, హయత్ అలీ, సయ్యద్ చాంద్, మెకానిక్ బాష పాల్గొన్నారు.

టెండర్ లేకుండా పనులెలా చేస్తారు..?

- టైటిల్ డీడ్ మార్చడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు
-14వ ఆర్థిక సంఘం నిధులను ఖర్చు చేయండి
-టిడిపి ఫ్లోర్ లీడర్ దయాసాగర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

'పట్టణంలోని ప్రధాన కూడలిలో డివైడర్స్‌కు రంగులు వేస్తున్నారు. మంచిదే. ఎస్టిమేట్, టెండర్, అగ్రిమెంట్, కౌన్సిల్ ఆమోదం లేకుండా పనులు ఎలా చేయిస్తున్నార'ని మున్సిపల్ కౌన్సిల్ టిడిపి ఫ్లోర్ లీడర్ విజిఎ.దయాసాగర్ ప్రశ్నించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. అజెండా అంశాలను ఆమోదించారు. ముందుగా దయాసాగర్ మాట్లాడుతూ... అనంతపురానికి చెందిన కాంట్రాక్టర్‌కు రంగు పనులు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని, వైడబ్ల్యుసిఎస్ గ్రౌండ్‌లో షాపులు తొలగించడంలో ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. సొసైటీ అధికారులు కోర్టుకు వెళ్లగా రికార్డులు పరిశీలించి మున్సిపల్ కమిషనర్ నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. ఇంతవరకు కోర్టుకు సమాధానం చెప్పలేదని తెలిపారు. మున్సిపల్‌లో టైటిల్ డీడ్ మార్పు కోసం సంబంధిత అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. 14వ ఫైనాన్స్ నిధులను ఖర్చు చేయడం లేదని, ఇంతవరకు రూ.3 కోట్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇంకా రూ.9 కోట్ల నిధులు ఉన్నాయని, బిల్లులు ఇవ్వరేమో అనే అనుమానంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని చెప్పారు. మార్చిలోపు ఖర్చు చేయకపోతే రూ.9 కోట్లు తిరిగి వెళ్లాయని తెలిపారు. కమిషనర్ గంగిరెడ్డి సమాధానమిస్తూ... సొసైటీ గ్రౌండ్ సమస్య కోర్టులో ఉందని, కోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవినీతి, ఆరోపణలపై విచారణ చేస్తామని చెప్పారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, డిఇ మనోహర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, టిపిఒ గోపాల్ కృష్ణ, టిడిపి కౌన్సిలర్ రామదాసు గౌడ్, వైసిపి కౌన్సిలర్లు బోయ బజారి, డిస్ కేశవ రెడ్డి, అమాన్, నాగేశప్ప, చంద్రమోహన్ రెడ్డి, ఇసాక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దయాసాగర్

ఈరన్న హుండీ ఆదాయం రూ.52.91 లక్షలు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.52,91,140 వచ్చిందని దేవాలయ సహాయ కమిషనర్ వాణి తెలిపారు. మంగళవారం స్వామి వారి హుండీ లెక్కింపు చేపట్టారు. నగదుతో పాటు బంగారం 22 గ్రాముల 800 మిల్లీగ్రాములు, వెండి 8 కిలోల 900 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.

కమనీయం.. శ్రీసిద్ధేశ్వరుని రథోత్సవం

హోళగుంద : శ్రీసిద్ధేశ్వరుని రథోత్సవం మంగళవారం కమనీయంగా సాగింది. ముందుగా రథోత్సవంలో ఉన్న విగ్రహ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటాలు, మేళతాళాలతో రథోత్సవాన్ని ఎదురు బసవన్న గుడి వరకు కొనసాగించారు. అక్కడి నుంచి రథోత్సవాన్ని యథాస్థానానికి చేర్చారు. ప్రతేడాది ఆలయ ధర్మకర్త రాజా పంపర గౌడ్ సొంత ఖర్చులతో రథోత్సవం, లంక దహనంతో పాటు జాతర నిర్వహిస్తున్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు నియోజకవర్గం నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్, ఆలూరు సిఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పి.కోటకొండ విఆర్‌ఒకు సన్మానం

దేవనకొండ : గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ అవార్డు పొందిన మండలంలోని పి.కోటకొండ విఆర్ఒ షేకన్నను సర్పంచి తిమ్మక్క భర్త పెద్ద లింగన్న ఆధ్వర్యంలో సన్మానించారు. మంగళవారం సచివాలయ సిబ్బంది, విఆర్ఎలు శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విధుల పట్ల అంకితభావంతో ప్రజలతో మమేకమై రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

మంత్రాలయం : రాత్రి వేళల్లో తుంగభద్ర నది నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్ రాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. గ్రామానికి చెందిన చిన్నరెడ్డి అనుమతులు లేకుండా తుంగభద్ర నది నుంచి ఇసుకను తరలిస్తుండగా నైట్ బీట్ కానిస్టేబుల్ పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను తహశీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు.

చిరు ధాన్యాల సాగుకు ప్రాధాన్యత

-2023ను అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటన
-జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

చిరు ధాన్యాల సాగుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, 2023వ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించారని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర్ రెడ్డి, గుంటూరు కమిషనరేట్ నుంచి వ్యవసాయాధికారి విశ్వేశ్వరప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని చిలుకలడోన రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి, చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చిరు ధాన్యాల సాగును పెంచేందుకు రైతులు చొరవ చూపాలని కోరారు. రాగులు, సజ్జలు, జొన్నలు, అరికెలు, సామలు పండించి వాటిని ఆహారంగా తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల పంటలకు ప్రభుత్వం విత్తనాలు అందిస్తోందని, మద్దతు ధర కల్పిస్తోందని చెప్పారు. చిరు ధాన్యాల్లో పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. రెండో పంటగా చిరు ధాన్యాల సాగు 3, 4 వరుసలుగా వేసుకొంటే 60–70 రోజుల్లో చేతికి వస్తుందని, లాభసాటిగా ఉంటుందని చెప్పారు. చిరుధాన్యాల వంటల తయారీకి మహిళలకు బనవాసిలో కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ ఇస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిరు ధాన్యాల పంటల సాగుపై స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో సూచనలు పొందవచ్చని తెలిపారు. గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి నాణ్యమైన విత్తనాలను ఆర్‌బికెల ద్వారా, సొసైటీల ద్వారా పంపిణీ చేయాలని గ్రామ రైతు వెంకట్‌రెడ్డి కోరారు. ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ జీరా గణేష్, ఎఇఒ నరసింహుడు, రేఖా మాధురి, సర్పంచి నాగమ్మ, ఎంపిటిసి లక్ష్మమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వైభవంగా సిద్ధేశ్వర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని హాల్వి గ్రామంలో వెలసిన శ్రీసిద్దేశ్వర స్వామి రథోత్సవం భక్తుల సమక్షంలో వైభవంగా సాగింది. మంగళవారం మండలంలోని హాల్వి, నదీచాగి, కుంభాల నూర్, మురళి, గోతుల దొడ్డి, గుడికంబాలి, వల్లూరు, కాత్రికి, మధిర, పొదలకుంట గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అభినవ మహంత స్వాముల చేత భక్తులు ప్రసాదాలను అందుకున్నారు. వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, వైసిపి నాయకులు చెన్నప్ప, బసవ ప్రభు, సిద్ధన్న గౌడ్, బిజెపి నాయకులు హనుమంతు పాల్గొని పూజలు నిర్వహించారు. అంతకుముందు టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు ఉల్లిగయ్య దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గ్రంథాలయాలతో సర్వతోముఖాభివృద్ధి

- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్
- 'గ్రంథాలయల అభివృద్ధి - ప్రజల భాగస్వామ్యం'పై రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - హాలహర్వి

యువత సర్వతోముఖాభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ తెలిపారు. మంగళవారం హాలహర్వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'గ్రంథాలయాల అభివృద్ధి–ప్రజల భాగస్వామ్యం' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదపడతాయని తెలిపారు. ఆధునిక యుగంలో సౌకర్యాలెన్ని పెరిగినా విద్యార్థులకు, ఉద్యోగార్థులకు, నిరుద్యోగులకు విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలే ప్రధాన ఆధారంగా ఉంటున్నాయని చెప్పారు. వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, సాహిత్యం, సంస్కృతం, నవలలు, భక్తి, విద్య, ఆరోగ్యం, చరిత్ర తదితర రకాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థుల కోసం ఇంటర్, డిగ్రీ పుస్తకాలు, రోజువారీ దినపత్రికలు, వార, పక్ష, మాస పత్రికలు, జనరల్ నాలెడ్జికి సంబంధించిన పుస్తకాలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పిల్లలు, పెద్దలకు అవసరమైన కథలు, నవలలు, చరిత్రకు సంబంధించిన పుస్తకాలున్నాయని వివరించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైతం విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, పాఠకుల కోరిక మేరకు ఎంసెట్, ఇంజినీరింగ్ నుంచి గ్రూపు వన్, సివిల్స్ స్థాయి పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయాల్లో లభ్యమవుతున్నాయని చెప్పారు. మండల కేంద్రంలో గ్రంథాలయానికి సొంత భవనం లేకపోవడంతో 10 సెంట్ల భూమిని కేటాయించాలని తహశీల్దార్‌ను కోరారు. భూమిని కేటాయిస్తే రూ.40 లక్షలతో వచ్చే బడ్జెట్ సమావేశంలో మాట్లాడి భవనాని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారోత్సవాల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా సెక్రటరీ ప్రకాష్, గ్రంథాలయ మండల అధికారి రవీంద్రనాథ్, ఉమాకాంత్ స్వామి, తహశీల్దార్ మల్లికార్జున, ఎంపిడిఒ ఆంథోని, ఎంఇఒ ఈరన్న, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, ఎంపిపి భర్త పరశు, తిప్పారెడ్డి, సొసైటీ ఛైర్మన్ సీనప్ప, ఆలూరు మాజీ జడ్‌పిటిసి రాంభీంనాయుడు పాల్గొన్నారు.



ప్రజలకు మెరుగైన సేవలందించాలి

- కెడిసిసి జిల్లా డైరెక్టర్ రాఘవేంద్ర

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ శాఖ అధికారులకు కెడిసిసి జిల్లా డైరెక్టర్ రాఘవేంద్ర సూచించారు. మంగళవారం తహశీల్దార్ కుమారస్వామిని కెడిసిసి జిల్లా డైరెక్టర్ రాఘవేంద్ర, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, డిప్యూటీ తహశీల్దార్ రమణబాబు, మండల సర్వేయర్ మంజుభార్గవి శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగులకు లభించే ఉత్తమ అవార్డులు వారిలో మరింత బాధ్యతలను పెంచుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు కార్యక్రమంలో భాగంగా తహశీల్దార్ కుమారస్వామి, తంగరడోణ విఆర్ఒ రామాంజినేయులు, శంకరబండ గ్రామ సచివాలయ సర్వేయర్ సురేష్‌కు ఉత్తమ సేవా అవార్డులు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంకితభావం, క్రమశిక్షణ, చిత్తశుద్ధి ఉన్న వారికే అవార్డులు వస్తాయన్నారు. రెవెన్యూ శాఖలో మూడు అవార్డులు రావడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ లక్ష్మన్న, గ్రామ వాలంటీరు రాజు పాల్గొన్నారు.



తహశీల్దార్ కుమారస్వామిని సన్మానిస్తున్న రాఘవేంద్ర

తెలుగు కవుల ప్రాముఖ్యతను చాటి చెప్పాలి

- ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

తెలుగు కవుల ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెప్పాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం పెద్దకడబూరు మండలం హెచ్.మురవణి ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయులుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్య వేత్త గద్వాల సోమన్నను ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు. అనంతరం సోమన్న రచించిన 30 పుస్తకాలు నరసింహారెడ్డికి బహూకరించి సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు జయరాజు, లక్ష్మీనారాయణ, నారాయణ నాయక్, పి.శ్రీనివాసులు, తాయప్ప, పాండురంగ, రామకృష్ణుడు, వినోద్, ఆంజనేయులు, బాబయ్య, ప్రసన్నరాజు, జనార్ధన్, అడివన్న, ఈరన్న, పౌలన్న, తులసీ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిని సన్మానిస్తున్న సోమన్న

ఉగాదికి గృహ ప్రవేశాలు : హౌసింగ్ ఎఇ

ప్రజాశక్తి-కోసిగి రూరల్

పేదలందరికీ ఇల్లులో భాగంగా మండలంలో 3,518 ఇళు మంజూరు చేసినట్లు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ఉగాదికి 5 లక్షల ఇళ్లలో గృహ ప్రవేశాలు చేపడుతున్నట్లు హౌసింగ్ ఎఇ షేక్షావలీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలానికి 975 ఇళ్లను లక్ష్యంగా ఇచ్చినట్లు చెప్పారు. ఇప్పటివరకు దాదాపు 560 ఇళ్లను పూర్తి చేశామని, ఇంకా పూర్తి చేయాల్సినవి దాదాపు 415 ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డి సమన్వయంతో అందరి నాయకుల సహకారంతో 415 ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తి చేస్తామని తెలిపారు.



అన్నవరం.. 'దివీస్'తో కకావికలం

- కిడ్నీ వ్యాధితో పలువురు సతమతం
- పలు గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితం



కాలుష్య కారక దివీస్ లేబొరేటరీ ముఖద్వారం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం మండలం చిప్పాడ సముద్ర తీరం వద్ద 2002లో ఏర్పాటైన 'దివీస్' ఫార్మా కంపెనీతో పలు గ్రామాల్లో కాలుష్య పీడితుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఈ మందుల కంపెనీకి ఆనుకునే ఉన్న అన్నవరం ఒకనాటి కోనసీమగా కొబ్బరి తోటలతో వర్థిల్లేది. గడచిన 15 ఏళ్లలో దివీస్ వ్యర్థజలాల కారణంగా భూగర్భం విషతుల్యమై కొబ్బరి కాయల దిగుబడిపై తీవ్ర దుష్ప్రభావం చూపింది. చుట్టుపక్కల పది గ్రామాల్లో 30 వేల మంది జనాభాపై దివీస్ కాలుష్య ప్రభావం ఉంది. దీని పరిసర ప్రాంతాలన్నీ విషతుల్యమవుతున్నా తొలి నుంచీ ప్రభుత్వాలేవీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపించాయి. అన్నవరం గ్రామాన్ని 'ప్రజాశక్తి' సందర్శించింది. 2002లో దివీస్ పరిశ్రమ ఏర్పాటైనప్పుడు ఈ గ్రామ జనాభా సమారు నాలుగు. నేడు ఎనిమిది వేలకుపైగా ఉంది. ఇంటికో ఉద్యోగం నినాదంతో దివీస్ ఇక్కడ అడుగుపెట్టింది. ఈ హామీ నేటికీ అమలు కాలేదు. ఏ ప్రభుత్వమూ తమకు న్యాయం జరిగేలా చూడడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూగర్భ జలాలు విషతుల్యం

అన్నవరంలో 1500 ఎకరాల సాగు భూమి ఉంది. దీంట్లో వెయ్యి ఎకరాల్లో కొబ్బరి తోటలే ఉన్నాయి. గతంలో ఉలవలు పండేవి. నీరు, భూమి కాలుష్యం కావడంతో ప్రస్తుతం వరి సాగు గురించి ఈ గ్రామస్తులు పూర్తిగా మరిచిపోయారు. 400 ఎకరాలకుపైగా భూమిని దివీస్ చేజిక్కించుకుని ఔషధాలకు అవసరమైన పౌడరును ఉత్పత్తి చేస్తోంది. తీరం ఒడ్డునే దివీస్ ఉండడంతో రసాయన వ్యర్థాలు విడుదల కావడంతో సముద్రంలోని చేపలు మృత్యువాతపడుతున్నాయి. 'మాకు సముద్ర తీరం ఉన్నా చేపలు పట్టలేకపోతున్నాం. ఒకవేళ వలకు దొరికినా విషతుల్య సంపదే లభిస్తోంది. అందుకే ఫిషింగ్ హార్బర్‌కు చేపల వేటకు వెళ్తున్నాం' అంటూ పలువురు మత్స్యకారులు 'ప్రజాశక్తి' ఎదుట వాపోయారు. గతంలో ఈ ప్రాంతంలో 1500 మంది మత్స్యకారులు ఉండేవారు. ఇక్కడ చేపల వేట సాగకపోవడంతో వీరిలో వెయ్యిమంది వరకూ విశాఖ తీరానికి వలసపోయారు. అన్నవరం పంచాయతీ పరిధిలోని కొత్తపేటలో 50 వరకూ గీత కార్మిక కుటుంబాలు ఉండేవి. చెట్లెక్కి కల్లు తీసినా మందుల వాసన రావడంతో మానుకున్నారు. సుమారు 6-7 కిలోమీటర్లు దూరం వెళ్లి కల్లు గీసుకుని జీవనాధారం సాగిస్తున్నారు.

అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు మంగళం

దివీస్ తన సిఎస్‌ఆర్ నిధులతో పోలీస్ స్టేషన్లకు, రెవెన్యూ కార్యాలయాలకు, కొన్ని స్కూళ్లకు బెంచీలు అందించడం తప్ప గ్రామాల అభివృద్ధికి తోడ్పడలేదు. అన్నవరం గ్రామంలో ఆస్పత్రి లేదు. ఈ గ్రామంలో పైప్‌లైన్ కోసం రూ.10 లక్షలను తొలినాళ్లలో మంజూరు చేసింది. ఇలాంటి చర్యలేవీ కాలుష్యాన్ని ఆపడం లేదు. ఈ గ్రామంలో అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు యాజమాన్యం చొరవ చూపలేదు. దివీస్ ఈ ప్రాంతంలో 1, 2 యూనిట్లనే కాకుండా మాన్సాస్ సంస్థ నుంచి 99 ఎకరాలు కొనుగోలు చేసి మూడో యూనిట్‌నూ స్థాపించింది. ఇప్పటికే 470కిపైగా రియాక్టర్లతో నడుస్తోంది. చిప్పాడ, అన్నవరం, కొత్తపేట, పైలపేట, ఆశ్రయ్యపాలెం, గొల్లపాలెం, ఎస్‌సి కాలనీ, కొత్త గొల్లలపేట, కంచేరుపాలెం, మూలకొద్దు, నమ్మివానిపాలెం, పెదనాగమల్లిపాలెం గ్రామాలపై కాలుష్యం ప్రభావం చూపుతోంది. ఆయా చోట్ల భూముల్లో నీరు క్రమంగా విషతుల్యం అవుతోంది. బోరు బావుల నుంచి ఎర్రని నీరు రావడంతో ఈ నీటిని గ్రామస్తులు తాగడం ఏనాడో మానేశారు. అన్నవరం, చిప్పాడ గ్రామాల్లో పూర్తిగా నీరు కలుషితమైంది. గోస్తనీ నది నుంచి నేరుగా అన్నవరం గ్రామానికి నీరిచ్చేలా ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాలుష్యంతో గ్రామాలు వణుకుతున్నా, ఉపాధి లేక బయట ఊళ్లకు తరలిపోతున్నా దివీస్ యాజమాన్యంలో చలనం లేకపోవడంతో గ్రామస్తులు కొద్దిరోజులుగా పోరుబాట పట్టారు. దీంతో, దివీస్ యాజమాన్యం తాజాగా ఉద్యోగాల కల్పనకు కొన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

జబ్బు చేస్తే విశాఖ వెళ్లాల్సిందే..

ప్రస్తుతం అన్నవరం గ్రామంలో ఆరుగురు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. వీరి కాకుండా మరికొంతమంది కూడా ఉండవచ్చని, వ్యాధి గురించి బయటకు చెప్పుకోవడానికి వీరు ఇష్టపడడం లేదని, డయాలసిస్ చేయించుకుంటే వ్యాధి విషయం అందరికీ తెలిసిపోతుందని భయపడుతున్నారని గ్రామ ఎంపిటిసి సభ్యులు అప్పలరాజు చెబుతున్నారు. గ్రామస్తులందరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తే కాలుష్య కారణంగా వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలు తెలుస్తాయని అభిప్రాయపడ్డారు.

గ్రామ సర్పంచ్ ఎల్లాజీ మాట్లాడుతూ తీర ప్రాంతం కాబట్టి అన్నవరంలో 60 శాతం మంది మత్స్యకారులే ఉన్నారని తెలిపారు. గోస్తనీ నది నుంచి నీటిని నేరుగా దివీస్ యాజమాన్యం లాక్కొంటోందని, అన్నవరం గ్రామానికి ఎందుకివ్వరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దివీస్ కాలుష్యంపై పాలకులకు వినతిపత్రాలు అందించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. తనపై దివీస్ రెండు కేసులు పెట్టించిందని తెలిపారు. పోరాటాలు, విజ్ఞప్తులు మూలంగా తాజాగా 25 మంది స్థానికులకు ఉద్యోగం ఇచ్చేందుకు దివీస్ యాజమాన్యం అంగీకరించిందని చెప్పారు.


విజేతలతో డిఇఒ డాక్టర్ వెంకటరంగారెడ్డి ,కోచ్‌లు, పిఇటిలు

స్కూల్ గేమ్స్ పోటీలలో కర్నూలు జట్లకు డబుల్ క్రౌన్

ప్రజాశక్తి- కర్నూల్ స్పోర్ట్స్

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 17 బాలబాలికల రగ్బీ పోటీలలో కర్నూలు బాలబాలికల జట్లు విజేతలయి డబుల్ క్రౌన్ సాధించారు. మంగళవారం నగర్ శివారులోని ఆదర్శవిద్యా మందిరంలో ఏర్పాటు చేసిన స్కూల్ గేమ్స్‌పోటీల విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమంలో డిఇఒ డాక్టర్ వి.రంగారెడ్డి విజేతలకు షీల్డు, పథకాలు ప్రతిభాప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్న వివిధ జిల్లాల జట్ల అన్నిటిలో కర్నూలు జట్లు చక్కని ప్రతిభను ప్రదర్శించి విజేతలుగా నిలవడం సంతోష కరమన్నారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులకు పోటీలు సజావుగా నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ విద్యా మందిరం కరెస్పాండెంట్ బి.తిమ్మయ్య, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా పిఇటిల సంఘం కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జోసఫ్ లక్ష్మయ్య, జిల్లా అడ్వైజర్ ఎం.విజయ్‌కుమార్, జిల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వెంకటరాముడు ఎస్ఎండి బాష, సుభాని, వెంకటేశ్వర్లు ,మహిళా వ్యాయామ ఉపాధ్యాయులు శారద, జ్యోతి, జయమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రరగ్బీ బాల బాలికల విజేతలు కర్నూలు

ఆదర్శ విద్యా మందిరంలో మంగళవారం జరిగిన బాలుర ఫైనల్ పోటీలో కర్నూలు జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై 25-10 స్కోర్‌తో తో గెలిచి విన్నర్స్ స్థానం సాధించింది. నెల్లూరు జట్టు రన్నర్స్ స్థానంలో నిలిచింది. ప్రకాశం జిల్లా జట్టు తృతీయ స్థానం, విశాఖపట్నం జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో కర్నూలు జట్టు నెల్లూరు జిల్లా జట్టుపై 5-1 స్కోర్ తో గెలిచి విన్నర్స్ స్థానంలో నిలిచారు.

డ్రెయినేజీ కాలువలు నిర్మించాలి: సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని సెంట్రల్ లైబ్రరీ వెనక వైపు ఉన్న, ఇంటి నంబర్ 62/ 31 నుండి 62 /79 వరకు గల, డ్రెయినేజీ కాలువను నిర్మించాలని, నగర పాలక సంస్థ కమిషనర్‌ను ప్రజాప్రతినిధిలను సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ముహమ్మద్ షరీఫ్ డిమండ్ చేశారు. దాదాపు 150 నుండి 200 ఇళ్లకు పైగా, ముందు డ్రెయినేజీ కట్టడం కోసం కాలువలు తవ్వి, ఒక నెల అవుతున్నప్పటికీ, ఏమాత్రం పట్టించుకోకుండా ఉన్నా, మున్సిపల్ అధికారుల వైఖరిని, నిర్లక్ష్యాన్ని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు, ముహమ్మద్ షరీఫ్ తీవ్రంగా ఎండగట్టారు. దాదాపు మనిషి లోతు ఇండ్ల ముందు కాలువ ఇప్పుడే పూర్తి చేసే లాగ తవ్వడంతో ముసలి, ముతక, పిల్లలు ఇంటి నుండీ బయటికి రాలేని పరిస్థితి ఏర్పడిందని, అయన ఆగ్రహం వ్యక్తంచేశారు. నిత్యావసర వస్తువులు తేవడం కోసం బయటికి రావలంటే, నానాకతంటలు పడాల్సిన పరిస్థితి ఉందని, అక్కడి ప్రజల బాధలు వర్ణణాతీమని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబంలోని వయసు రీత్యా పెద్దమనుషులుగా, ఉండి ముసలి వాళ్లు బయట కూడా రాకుండా, జైలులో నిర్బంధించినట్టు వారి కష్టాలు ఉన్నాయని వివరించారు. తక్షణమే నగరపాలక సంస్థ కమిషనర్, ఎమ్మెల్యే స్పందించి డ్రైనేజి కాలువ నిర్మించాలని డిమండ్ చేశారు

పటిష్టమైన ఉన్నత విద్యతోనే దేశాభివృద్ధి

- ఎయులో సౌత్ జోన్ విసిల సదస్సులో గవర్నర్ విశ్వభూషణ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

పటిష్టమైన ఉన్నత విద్యా వ్యవస్థతోనే దేశ అభ్యున్నతి సాధ్యమవుతుందని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విశాఖ బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సౌజన్యంతో ఎయు నిర్వహిస్తోన్న 'సౌత్ జోన్ వైస్ ఛాన్సలర్స్ మీట్ 2023 - రీసెర్చ్ అండ్ ఎక్సలెన్స్ ఫర్ ట్రాన్సఫ్మేటివ్ హయ్యర్ ఎడ్యుకేషన్' కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించి వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన ఉపకులపతులను ఉద్దేశించి మాట్లాడారు. దేశాభివృద్ధికి ఉన్నత విద్య ఎంతో ప్రధానమైన అంశమని తెలిపారు. నవ్య భారతావని నిర్మాతలను తీర్చిదిద్దే బాధ్యతను విశ్వవిద్యాలయాలు స్వీకరించాలని పిలుపునిచ్చారు. పరిశోధనా రంగంలో పెట్టుబడులు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రపంచ స్థాయి ర్యాంకింగ్‌లో అత్యుత్తమ స్థానంలో భారతీయ విశ్వవిద్యాలయాలు నిలవాలని ఆకాంక్షించారు. నాలెడ్జ్ సూపర్ పవర్ లీడర్‌గా నేడు భారత్ నిలుస్తోందని తెలిపారు. విద్యా రంగం వృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, మెరుగైన వైద్య సేవలు దేశంలో పెరుగుతున్నాయని అన్నారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టం కలిగి ఉందని నాస్‌కామ్ స్పష్టం చేసిందని తెలిపారు. 2022 నాటికి దేశంలో 80 వేలకుపైగా స్టార్టప్ సంస్థలు ఉన్నాయన్నారు. అనంతరం ఎఐయు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఎయులోని డాక్టర్ విఎస్.కృష్ణ గ్రంథాలయంలో దశాబ్దాల కాలం నుంచీ ఉన్న 2.5 లక్షల తాళపత్రాలను డిజిటలైజేషన్ చేయగా వాటిని గవర్నర్ బటన్ నొక్కి అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఎఐయు సెక్రటరీ జనరల్ డాక్టర్ పంకజ్ మిట్టల్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా, ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు కె.రామ్మోహనరావు, ఎయు విసి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.


సౌత్ జోన్ విసిల సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి-తుగ్గలి


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేశి

ప్రజా సమస్యలను పరిష్కరించడమే గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమ లక్ష్యమని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలం పరిధిలోని జొన్నగిరి గ్రామంలో స్థానిక నాయకులు ఎర్రనాగప్ప, రఘు, ప్రతాపరెడ్డి, పక్కీరప్ప, సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల సమస్యలను పరిష్కరించే దిశలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ దశగా ప్రజలకు సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవానికి అందాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి పులికొండ నాయక్, సర్పంచు ఓబులేసు, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ గుంత దేవి, వైస్ ఎంపిపి ఎర్ర నాగప్ప ఎంపిటిసి ప్రతాపరెడ్డి, రైతు ఉత్పత్తి దారుల సంఘం చైర్మన్ సోమశేఖర్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు , కార్యకర్తలు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిని చట్టసభలకు పంపాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని మాత్రమే చట్టసభలకు పంపాలని పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి కమ్మారు నాగరాజు అన్నారు. మంగళవారం కర్నూలులో పెద్దలు డాక్టర్ భవాని ప్రసాద్, మహర్షి మీడియా గ్రూప్ ఎండి మద్దులేటితో కలిసి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు డాక్టర్లు, బిజినెస్ మ్యాన్‌లు,రియలేస్టేట్ వ్యాపారులు, జర్నలిస్ట్‌లను కలిసి తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువు ఉండి కింది స్థాయి నుండి కష్టపడి వచ్చి విద్య, వైద్యం,ఉద్యోగం అన్ని రంగాల్లో ఎలాంటి కష్టాలు ఉంటాయో అనుభవించానన్నారు. అలాంటి కష్టాలు రాబోయే తరానికి రాకుండా చట్ట సభల్లో పేదల గొంతు వినిపోయించేలా తమను గెలిపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు వల్ల ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.



15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలలో పక్షపాతం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు విషయంలో వైసిపి ప్రభుత్వం పక్షపాత ధోరణి ప్రదర్శించడం సిగ్గుచేటని టిడిపి కోడుమూరు ఇన్‌ఛార్జి ఆకెపోగు ప్రభాకర్ అన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి నాయకులు నిధులను అన్నింటిని తమ పార్టీ ఎంపిటిసిలకే కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎక్కడైతే నిధుల అవసరం ఉందో, పార్టీలతో సంబంధం లేకుండా నిజంగా ఎక్కడైతే అభివృద్ధి చెందలేదో, అత్యవసరంగా ఏ గ్రామానికి నిధులు అవసరమో అక్కడ నిధులను కేటాయించాల్సి ఉందన్నారు. నిధుల విడుదల కేటాయింపుల విషయంలో ఈ ప్రభుత్వం తమ ఎంపిటిసిలకే కేటాయించుకోవడం, టిడిపి ఎంపీటీసీలకు నిధులు కేటాయించకపోవడం ఇది పక్షపాత ధోరణి కాదా? అని ప్రశ్నించారు. నిధుల కేటాయింపు విషయంలో కులం, మతం, పార్టీలు అని చూడబోమని భారీ డైలాగులు కొట్టే వారు డైలాగులకు మాత్రమే పరిమితం అయ్యారన్నారు. కార్యక్రమంలో కర్నూలు మండలం టిడిపి అధ్యక్షులు బుర్ర వెంకటేష్ నాయుడు, కర్నూలు పార్లమెంట్ టిడిపి మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎం.సయ్యద్, కర్నూలు పార్లమెంటు టిడిపి మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్షావలి, కర్నూలు మండలం ఐటిడిపి నాయకులు సయ్యద్‌బాష, ఉల్చాల గ్రామ కమిటీ అధ్యక్షులు నాగేశ్వరరావు, మైనార్టీ నాయకులు బషీర్, నియోజకవర్గం ఐటిడిపి అధ్యక్షులు కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి రథోత్సవం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో వెలసిన భద్రకాళీ వీరభద్ర స్వామి రథోత్సవం మంగళవారం ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించి సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు వేల సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవ కార్యక్రమానికి పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొని స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పత్తికొండ అర్బన్ సిఐ మురళీమోహన్ రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి దేవనకొండ, జొన్నగిరి, మద్దికెర, తుగ్గలి ఎస్‌ఐలు ప్రత్యేక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ తహశీల్దార్ విష్ణు ప్రసాద్, పత్తికొండ ఎంపిపి మండల కన్వీనర్ కారం నాగరాజు వైసిపి నాయకులు బనగాని శ్రీనివాసులు ,సర్పంచి నాగప్ప ఎంపిటిసి నెట్టకల్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ షూటింగ్ బాల్ జట్టు కోచ్ గా పరుశ రాముడు

ప్రజాశక్తి- కర్నూల్ స్పోర్ట్స్

ఫిబ్రవరి నెలలో 1, 2 తేదీలలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్ పట్టణంలో జరుగనున్న మొదటి ఏషియన్ షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొనే భారత పురుషుల జట్టు శిక్షకుడిగా పరశురాముడు ఎంపికైనట్టు ఈ మేరకు ఏషియన్ షూటింగ్ బాల్ ఫెడరేషన్ 'సెక్రటరీ జనరల్ రవీంద్ర సింగ్ తోమర్ ఉత్తర్వులు అందాయని తెలిపారు. ప్రస్తుతం పరశురాముడు ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బ్రాహ్మణదొడ్డిలో సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోని బ్రాహ్మణదొడ్డిలోని సచివాలయాన్ని ఎంపిడిఒ రాముడు మంగళవారం తనిఖీ చేపట్టారు. ఇక్కడే హాజరు రికార్డును, పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో సమీక్షించి సచివాలయం సేవలు మెరుగ్గా ఉండాలని సూచించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా తగు దృష్టి సారించాలని పేర్కొన్నారు.

డయల్ యువర్ ఎస్ఇకి 15 వినతులు

ప్రజాశక్తి-కర్నూల్ కార్పొరేషన్

డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమానికి 15 వినతులు అందాయని ఎపి ఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఎం. ఉమాపతి తెలిపారు. మంగళవారం ఎస్ఇ కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమంలో కరెంట్ లైన్‌లకు సంబంధించి ఐదు, స్తంభాలకు సంబంధించి రెండు, తరచూ కరెంటు సరఫరా సరిగా లేకపోవడం గురించి రెండు, కొత్త సర్వీసులు ఇచ్చినవి మూడు, ఇతరములు మూడు మొత్తం 15 వినతులు అందాయని తెలిపారు. ఆర్థికపరమైన సమస్యలు మినహా చిన్న సమస్యలను వెంటనే సంబంధిత అధికారులతో పరిష్కరిస్తామని తెలిపారు.

అదానీ సొంత ఉద్యోగుల అనాసక్తి

- ఎఫ్‌పిఒకు దూరం



ముంబయి : అదానీ కంపెనీ షేర్లపై ఆ సంస్థ ఉద్యోగులే అనాసక్తిని వ్యక్తం చేశారు. ఇందుకు నిదర్శనం అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పిఒ)ల్లో పెట్టుబడులకు వారు దూరంగా ఉండటమే. హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో ఇందులో పెట్టుబడులకు రిటైల్ ఇన్వెస్టర్లు, ఆ కంపెనీ ఉద్యోగులు ఆచితూచి వ్యవహారించారు. జనవరి 31తో ముగిసిన ఈ ఇష్యూలో రిటైల్ ఇన్వెస్టర్లు, ఉద్యోగుల కోసం 2.29 కోట్ల షేర్లను కేటాయించగా.. 11 శాతం మాత్రమే సబ్‌స్రయిబ్ అయ్యాయి. అదానీ గ్రూపు కంపెనీల ఉద్యోగులు కూడా ఈ ఇష్యూకు దూరంగా ఉండటం విశేషం. ఉద్యోగులు తమకు కేటాయించిన 1.6 లక్షల షేర్లలో 52 శాతం షేర్లకు మాత్రమే బిడ్లు దాఖలు అయ్యాయి. ఈ ఎఫ్‌పిఒతో అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.20,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా.. 4.55 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచగా.. 4.62 కోట్లకు బిడ్లు దాఖలయ్యాయి. నాన్ ఇన్స్‌ట్యూట్ ఇన్వెస్టర్లు, క్వాలిఫైడ్ ఇన్స్‌ట్యూషనల్ బయ్యర్స్ విభాగంలో ఎక్కువగా దరఖాస్తులు రావడంతో పూర్తిగా సబ్‌స్రయిబ్ అయ్యింది.

అదానీ గ్రూపు కంపెనీలు తీవ్ర మోసాలకు పాల్పడుతున్నాయని అమెరికన్ పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బకు గౌతం అదానీ ఊహించని నష్టాలు చవి చూస్తున్న విషయం తెలిసిందే. స్టాక్ మార్కెట్లలో వరుస భారీ నష్టాలతో అదానీ టాప్ -10 కుబేరుల జాబితాలో చోటు కోల్పోయారు. దీంతో ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానం నుంచి ఏకంగా 11వ స్థానానికి దిగజారారని బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ మంగళవారం ఓ రిపోర్టులో తెలిపింది. 2022లో అదానీ అత్యధికంగా రూ.3.2 లక్షల కోట్ల సంపదను కూడబెట్టుకున్నారు. లక్షల కోట్ల సంపద కోల్పోయినప్పటికీ.. ఇప్పటికీ అదానీ భారత ధనవంతుల్లో ఒక్కటో స్థానంలో ఉన్నారు. ముకేష్ అంబానీ రూ.6.7 లక్షల కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. ప్రపంచ కుబేరులతో పోల్చితే రిలయన్స్ అధినేత 13వ స్థానంలో ఉన్నారు. "అదానీ గ్రూపు సంస్థల ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన కుటుంబ సభ్యులు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ఆ కంపెనీ షేర్లను మానిప్యులేషన్ చేస్తుంది. ఎకౌంట్స్‌లో మోసాలకు పాల్పడుతుంది. షేర్ల ధరలను కృత్రిమంగా పెంచింది. పన్ను ఎగవేత, మనీ లాండరింగ్ మోసాల కోసం అనేక అడ్డదారులు తొక్కింది. అప్పుల కోసం మోసాలకు పాల్పడింది. మూడేళ్ల క్రితం అదానీ సంపద రూ.1.62 లక్షల కోట్లుగా ఉండగా.. ఇటీవల రూ.10 లక్షల కోట్ల చేరువకు వెళ్లింది. జాతీయవాదం పేరుతో దేశాన్ని క్రమపద్ధతిలో దోచుకుంటుంది." అని హిండెన్‌బర్గ్ రిపోర్ట్ చేసిన విషయం తెలిసిందే.

కోల్ ఇండియా లాభాల్లో 70% వృద్ధి

కోల్‌కత్తా : ప్రభుత్వ రంగంలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సిఐఎల్) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 70 శాతం వృద్ధితో రూ.7,755.55 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.4,558.39 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ3లో కంపెనీ ఉత్పత్తి పెరగడంతో పాటు డిమాండ్, అధిక అమ్మకాలు మెరుగైన ఫలితాలకు దోహదం చేశాయి. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ రూ.35,169 కోట్లకు చేరింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.28,433 కోట్లుగా చోటు చేసుకుంది.

అమెజాన్ ఫ్రెష్‌పై ఆఫర్స్

న్యూఢిల్లీ : అమెజాన్ ప్రైమ్ కస్టమర్స్ రూ.1200పైన ఆర్డర్, సాధారణ వినియోగదారుల కనీస ఆర్డర్ ర.1500 పైన పలు ఆఫర్లను అందిస్తున్నట్లు అమెజాన్ ఫ్రెష్ తెలిపింది. ఈ ఆర్డర్‌పై రూ.200 క్యాష్ బ్యాక్, రూ.249కి పైగా అన్ని ఆర్డర్స్‌పై ప్రైమ్ కస్టమర్స్ ఉచిత డెలివరీ పొందవచ్చని పేర్కొంది. పలు బ్యాంక్ కార్డులపై డిస్కొంట్లను అందిస్తున్నట్లు తెలిపింది.

ఒఎల్‌ఎక్స్‌లో 1500 మందిపై వేటు



న్యూఢిల్లీ : వాడిన ఉత్పత్తు లను విక్రయించే ఆన్‌లైన్ వేదిక ఒఎల్‌ఎక్స్‌లో పని చేస్తున్న 1500 మంది ఉద్యోగులను ఇంటికి పంపించనున్నారు. ఆర్థిక మాంద్యం భయాల నేపథ్యంలో ఆ కంపెనీ తొలగింపులకు పాల్పడుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సంస్థలో 10వేల మంది పని చేస్తుండగా.. ఇందులో 15 శాతం మందికి ఉద్వాసన పలికేందుకు ఆ సంస్థ సిద్ధం అవుతోంది. ఇందులో భారత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు సైతం ఉన్నారు. ఇంజినీరింగ్, ఆపరేషన్స్ టీమ్‌లో పనిచేసే ఉద్యో గులపైనా తొలగింపులు ఉండొచ్చని రిపోర్టులు వస్తున్నాయి. కాగా.. భారత్ లో ఎంతమందిని తొలగిస్తున్నారనేది స్పష్టత రావాల్సి ఉంది.



నూతన ఇన్నోవా క్రిస్టా బుకింగ్స్ ప్రారంభం

న్యూఢిల్లీ : టయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) తాజాగా తమ నూతన ఇన్నోవా క్రిస్టా కోసం బుకింగ్స్‌ను ప్రారంభించినట్లు మంగళవారం ప్రకటించింది. ఈ నూతన ఇన్నోవా క్రిస్టా ఆధునీకరించబడిన ఫ్రంట్ ఫాసియాతో వస్తుందని పేర్కొంది. ఇది భారతీయ కుటుంబాలు, వ్యాపారవేత్తలు, కార్పోరేట్స్, ఫ్లీట్ యజమానుల అవసరాలను తీర్చనుందని తెలిపింది. తమ డీలర్ లేదా అవుట్‌లెట్, ఆన్‌లైన్‌లో రూ.50వేలు చెల్లించి బుక్ చేసుకోవచ్చని తెలిపింది. ఈ నూతన ఇన్నోవా క్రిస్టా నాలుగు గ్రేడ్లలో ఐదు రంగులో అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది.

బజాజ్ అలయన్జ్ 'మై హెల్త్ కేర్ ప్లాన్'

పూణె : ప్రయివేటు జనరల్ బీమా సంస్థల్లో ఒక్కటైన బజాజ్ అలయన్జ్ జనరల్ ఇన్సూరెన్స్ తాజాగా మాడ్యులర్ ఆరోగ్య బీమా ఉత్పత్తి 'మై హెల్త్ కేర్ ప్లాన్'ను విడుదల చేసినట్లు తెలిపింది. వినియోగదారుల అవసరాలకు తగినట్లుగా కవరేజీని ఎంచుకునే సౌలభ్యం దీనిలో ఉందని ఆ సంస్థ తెలిపింది. పాలసీదారులు సొంత ఆరోగ్య సంరక్షణ ప్లాన్‌ను డిజైన్ చేసుకునే స్వేచ్ఛ కూడా ఉందని పేర్కొంది. దీన్ని అంబ్రెల్లా ప్రొడక్ట్ కింద విడుదల చేసినట్లు వెల్లడించింది. ఈ పథకంలో రూ.5 కోట్ల వరకూ సమ్ ఇన్సూర్ చేసే అవకాశం ఉందని తెలిపింది.



మార్కులు తక్కువ వస్తున్నాయని విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని బసవన్న కట్ట వీధికి చెందిన 9వ తరగతి విద్యార్థిని భవాని(14) సమ్మెటీవ్ పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తున్నాయని పురుగు మందుతాగి కోలుకోలేక మంగళవారం మృతి చెందిందని ఎస్సై రమణయ్య తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు... చాగలమర్రిలోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న భవాని(14) సమ్మెటీవ్ పరీక్షల్లో తోటి స్నేహితులకంటే తక్కువగా మార్కులు వచ్చాయని మనస్తాపానికి గురై గత నెల 28న ఇంటిలోని క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు వెంటనే కేరళ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాదుకు తరలిస్తుండగా మార్గమధ్యలో విద్యార్థిని మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఈ సారైనా ఇస్తారా..?

- గత ఏడాది జిల్లాకు మొండి చేయి
- నేడు కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గత ఏడాది కేంద్ర బడ్జెట్‌లో జిల్లాలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపింది. ఈ ఏడాది బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఈ సారైనా జిల్లాలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందేమో అని జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు...

ఉమ్మడి కర్నూలు జిల్లాకు గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌లో మొండి చేయి దక్కింది. జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులకు ఒక్క పైసా కూడా నిధులను కేటాయించలేదు.

రైల్వేపై చిన్నచూపు..

రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. పాత ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. కొత్త ప్రాజెక్టులను మంజూరు చేయడం లేదు. కర్నూలు సిటీ రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం వరకూ రైలు ఉన్నప్పటికీ అది రెండు రోజులకు ఒకసారి నడుస్తోంది. దాన్ని రోజూ నడపాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. కాచిగూడ నుంచి గుంటూరుకు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలును విజయవాడ వరకూ పొడిగించాలని ప్రజల నుంచి డిమాండ్ వ్యక్తం అవుతోంది. కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లాలంటే డోన్ మీదుగా వెళ్లాల్సి వస్తుండటంతో సమయం ఎక్కువ పడుతోంది. కర్నూలు నుంచి ఓర్వకల్లు, పాణ్యం మీదుగా నంద్యాలకు కొత్తగా రైల్వే లైన్ వేస్తే ప్రయాణ సమయం తగ్గిపోనుంది. వాటితో పాటు జిల్లాలోని పుణ్యక్షేత్రాలను కలిపేలా మంత్రాలయం - కర్నూలు - శ్రీశైలం కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది.

వెనుకబడిన కర్నూలు జిల్లాలో రాష్ట్ర విభజన సందర్భంగా బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీని కేటాయిస్తామని హామీని నెరవేర లేదు. ఈ హామీని ప్రతి బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తూ వస్తుంది. కేంద్రీయ విద్యా సంస్థలు ట్రిపుల్ ఐటి డిఎం విద్యా సంస్థకు ఒక్క పైసా కూడా కేటాయించలేదు. హైదరాబాద్ టు బెంగళూరు పారిశ్రామిక కారిడార్ కింద ఓర్వకల్ పారిశ్రామిక వాడ ఏర్పాటుకు అనుమతి ఇచ్చినప్పటికీ ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన ఇటువంటి చర్యలు మాత్రం తీసుకున్న దాఖలాలు లేవు. అనంతపురం టు అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే ఏర్పాటు గత ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తే ఇంతవరకూ ఆ ప్రాజెక్టు ముందుకు సాగడం లేదు. భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాం అని ప్రకటించినా కేంద్రం మాత్రం జాతీయ రహదారి విస్తరణ పనులకు మాత్రం ఎలాంటి నిధులు కేటాయించలేదు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ బుధవారం పార్లమెంట్‌లో

సాగని కోచ్ ఫ్యాక్టరీ...

కర్నూలు సమీపంలో ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్ తయారీ ఫ్యాక్టరీ పనులు ముందుకు సాగడం లేదు. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని ఆలంపూర్ రోడ్డు, కర్నూలు జిల్లా పరిధిలోని ఇ.తాండ్రపాడు, పంచలింగాల పరిధిలో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.562 కోట్లతో 123 ఎకరాల్లో దాని ఏర్పాటు పనులను ప్రారంభించారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రూ.30 కోట్లను దాని కోసం కేటాయించింది. ఈ ఏడాది రూ.58 కోట్లను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించారు. అవసరమైన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఈ రైల్వే కోచ్ ఫాక్టరీ పనులు ముందుకు సాగడం లేదు. కేవలం షెడ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఈ ఫ్యాక్టరీ పూర్తయితే నెలకు 50 రైల్ కోచ్‌లను తయారు చేసే అవకాశం ఉంటుంది. ఆ ఫ్యాక్టరీ వల్ల వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.



ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా ఉమ్మడి కర్నూలు జిల్లాకు నిధులు ఏమైనా దక్కుతాయేమోనని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు.

ట్రిపుల్ ఐటి డిఎంకు నిధులు కరువు..

రాష్ట్ర విభజన అనంతరం జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్ ఐటి డిఎం విద్యాసంస్థను ప్రకటించింది. 2015 నుండి కాంచీపురంలోని విద్యాసంస్థలో మూడేళ్లపాటు తరగతులను నిర్వహించారు. కర్నూలు నగర శివారులోని జగన్నాథ గట్టు సమీపంలో 150 ఎకరాలను కేటాయించారు. రూ.350 కోట్లను ప్రకటించగా భవన నిర్మాణాల కోసం రూ.35 కోట్లను మాత్రమే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. 2018లో జగన్నాథ గట్టు సమీపంలోనే తరగతులను ప్రారంభించారు. మొదట కేవలం తరగతుల నిర్వాహణకు అవసరమైన భవనాలను పూర్తి చేశారు. గత విద్యా సంవత్సరం నుండి హాస్టల్ భవనాలను పూర్తి చేసి సొంతంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ విద్యార్థులకు అవసరమైన భవనాలు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పరిశోధనాత్మక కోర్సులను కూడా అభ్యసించేందుకు అవసరమైన సౌకర్యాలూ కరువయ్యాయి.

వాడి వేడిగా కౌన్సిల్ సమావేశం

- పట్టణంలో మంచినీటి సమస్య తేల్చాలి - ప్లకార్డులతో టిడిపి కౌన్సిల్ సభ్యులు నిరసన
- గొడవలు సృష్టిస్తే సభ్యులపై చర్యలు తీసుకుంటాం : చైర్మన్



మాట్లాడుతున్న చైర్మన్ మాబున్నిసా



నిరసన తెలుపుతున్న టిడిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాదనలు ప్రతి వాదనల మధ్య మంగళవారం వాడివేడిగా సాగింది. ముందుగా మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నీసా అజెండా అంశాలను సమావేశం ముందుంచారు. టిడిపి కౌన్సిల్ సభ్యులు వలి, పి.నాగార్జున, జైనాబీ, శ్రీదేవిలు పట్టణంలో మంచినీటి సమస్యపై తేల్చాలని పట్టుబట్టారు. నీటి సమస్యపై జీరో అవర్లో చర్చించుకుందామని చైర్మన్ చెప్పినా సభ్యులు ఇప్పుడే తేల్చాలని ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. అజెండాకు అడ్డం తగిలి గొడవలు సృష్టించాలని చూస్తే సభ్యులపై చర్యలు తీసుకుంటామని, సస్పెండ్ చేయడానికి కూడా వెనకాడమని మున్సిపల్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 11వ వార్డు వైసిపి కౌన్సిలర్ పున్న రాజేశ్వరితో పాటు నాగినిరెడ్డి, మరి కొంతమంది సభ్యులు మాట్లాడుతూ నంద్యాల పట్టణానికి మంచినీటి సౌకర్యం కల్పించేందుకు ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. నంద్యాల పట్టణానికి ఎప్పుడు నీరు ఇస్తారో వివరించాలని చైర్మన్ మున్సిపల్ కమిషనర్‌కు సూచించగా ఫిబ్రవరి చివరికల్లా పెండింగ్ పనులన్నీ పూర్తి చేసుకొని రెగ్యులర్‌గా ఇస్తామని సభ్యులకు వివరించారు. కౌన్సిలర్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ తన వార్డులో టౌన్ ప్లానింగ్ అప్రూవల్ లేకుండానే అపార్ట్మెంట్‌లు వెలుస్తున్నాయని చెప్పారు. 11వ వార్డులో వాలంటీర్లు పనిచేయడం లేదని, కొత్త వారిని నియమించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న వాలంటీర్లకు కనీసం కేటాయించిన 50 వార్డులలో పేర్లు కూడా తెలియకపోవడం దురదృష్టకరమని 12వ వార్డు శ్యామ్ సుందర్ లాల్ అన్నారు. కో ఆప్షన్ సభ్యులు సలాముల్లా మాట్లాడుతూ మారుతి టౌన్‌షిప్‌లో వేస్తున్న రోడ్డు మున్సిపాలిటీ పరిధిలోకి తీసుకున్నారా అని చైర్మన్‌ను ప్రశ్నించారు. సమావేశం మొత్తం పట్టణంలోని నీటి సమస్యపైనే తిరగడం విశేషం. అజెండాలోని 13 అంశాలను మున్సిపల్ సమావేశం ఆమోదించింది. అందులో నంద్యాలలోని కల్పనా సెంటర్‌లో ఉన్న వివేకానంద విగ్రహం వద్ద ఉన్న స్థలంను రూ.4 లక్షలతో అభివృద్ధి, జగనన్న నగర బాట కార్యక్రమంలో భాగంగా అన్ని రోడ్లను పాట్ హోల్ ఫ్రీ రోడ్లుగా పనులను చేపట్టేందుకు ఆమోదం తెలిపారు. లైనింగ్ సీసీ ప్యాచెస్ పనులు, అమృత్ 2.0 పథకంకి యుఎల్‌బి ఫండ్ కింద రూ.78 లక్షలు మున్సిపల్ సాగర్ నిధుల నుండి మంజూరు చేయుట, మున్సిపల్ హైస్కూల్ షాపింగ్ కాంప్లెక్స్ షాపు పైన మరో మూడేళ్లు బిఎస్‌ఎన్‌ఎల్ టవర్‌ను ఉంచుకునేందుకు లీజు కాల పరిమితిని పెంచుట ఇలా అనేక అంశాలను మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదించారు.

పూర్తిగా బయటపడిన సంగమేశ్వరాలయం

ప్రజాశక్తి - కొత్తపల్లి

గత కొన్ని నెలల నుంచి కృష్ణమ్మ ఒడిలో చేరిన సంగమేశ్వరాలయం శ్రీశైలం వెనక జలాలు తగ్గిపోవడంతో మంగళవారం పూర్తిగా బయట పడింది. ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురాం శర్మ ఆధ్వర్యంలో ఆలయం శుభ్రం చేయించారు. గత కొన్ని నెలలుగా కృష్ణమ్మ ఒడిలో చేరిన సంగమేశ్వరాలయం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు ఎగువ ఆలయంలో పూజలు చేసుకొని నల్లమల అడవుల్లో ఉన్న పచ్చని చెట్లను, కనుచూపు మేరలో ఉన్న కృష్ణమ్మ పరవళ్లను కుటుంబ సమేతంగా తిలకించేవారు. శ్రీశైలం జలాలు తగ్గిపోవడంతో నేటి నుంచి ప్రతిరోజు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురాం శర్మ ఆధ్వర్యంలో పూజలు జరగనున్నాయి.

కృష్ణమ్మ ఒడి నుంచి పూర్తిగా బయటపడిన సంగమేశ్వరాలయం



మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీశైలంలోని అన్నపూర్ణ భవనం పక్కన గల సిసి కంట్రోల్ రూమ్‌లో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు చక్రపాణిరెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్. లవన్నలతో కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 11 నుండి 21 వరకు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పని చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రధానంగా ట్రాఫిక్, పార్కింగ్, పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాలపై అప్పగించిన విధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్వర్తించాలని జోనల్ అధికారులను ఆదేశించారు. రద్దీ ప్రాంతాలలో ఉచిత వైద్యశిబిరాలతో పాటు వైద్యనిపుణులు, అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని డిఎంహెచ్‌ఒకు సూచించారు. దోమలను అరికట్టేందుకు ఫాగింగ్ మెటీరియల్ సిద్ధంగా ఉండాలని మలేరియా అధికారిని ఆదేశించారు. శ్రీశైలంలోని పిహెచ్‌సి, దేవస్థానం ఆసుపత్రి, సున్నిపెంటలోని వైద్యశాల, శ్రీశైలంలో ఏర్పాటు చేసే తాత్కాలిక 30 పడకల ఆసుపత్రి 24 గంటలపాటు నిర్వహించేలా వైద్యసిబ్బందిని కేటాయించాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు. పాతాళగంగ, లింగాలగట్టు ప్రాంతాలలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు అనుమతిస్తున్నామని, 240 మంది గజ ఈతగాళ్లు, అవసరమైన లైఫ్ జాకెట్లు, పుట్టీలు, తాత్కాలిక టాయిలెట్లు, డ్రస్సింగ్ గదులు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ డిడిని, దేవస్థానం పారిశుధ్య విభాగపు సహాయ కార్యనిర్వహణాధికారులను కలెక్టర్ ఆదేశించారు. రవాణా సౌకర్యాల నిమిత్తం ఆంధ్ర ప్రాంతం నుండి 650 బస్సులు, తెలంగాణా నుండి 180 బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి ఆర్‌ఎంను ఆదేశించారు. ఆత్మకూరు నుండి దోర్నాల వరకు రోడ్డు ప్యాచింగ్ మరమ్మతులు, రేడియం స్టిక్కర్లు, రోడ్డుకిరువైపులా మట్టితో చదును చేసే పనులు వెంటనే ప్రారంభించాలని ఆర్అండ్‌బి ఈఈకి సూచించారు. ఇఒ ఎస్.లవన్న మాట్లాడుతూ భక్తులకు సులభంగా స్వామివారి దర్శనం అయ్యేలా నాలుగు రకాల క్యూలైన్లను ఏర్పాటు చేశామని వివరించారు. ఈ నెల 13న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివారి దేవస్థానం, 14న కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం, 15న రాష్ట్ర ప్రభుత్వం తరుపున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పిస్తారన్నారు. ఈ నెల 18వ తేదీ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంకాలం ప్రభోత్సవం, రాత్రి 10 గంటల నుండి పాగాలంకరణ, లింగోద్భవ కాల మహాన్యాస రుద్రదాభిషేకం, అర్ధరాత్రి 12 గంటలకు కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. మరుసటి రోజు రథోత్సవం, తెప్పోత్సవం ఉంటాయన్నారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పార్కింగ్ ప్రదేశాలలో దాదాపు 3 వేల వాహనాలను నిలుపుదల చేసేందుకు అవకాశం ఉందన్నారు. పోలీస్ యంత్రాంగానికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. పాగాలంకరణ ముగిసిన వెంటనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా రవాణా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి క్యూలైన్లు, ఆలయం, గంగాధర మండపం, శ్రీలలితాంబికా షాపింగ్ కాంప్లెక్స్ తదితర వాటిని పరిశీలించారు. సమావేశంలో డిఆర్‌ఒ పుల్లయ్య, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్



లాయర్ సుబ్బరామిరెడ్డి సతీమణిని పరామర్శిస్తున్న అఖిలప్రియ

టిడిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని మర్రిపల్లె గ్రామానికి చెందిన లాయర్ సుబ్బరామిరెడ్డి సతీమణి శివకుమారిని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ దంపతులు మంగళవారం పరామర్శించారు. గుండెకు స్టంట్ వేయించుకున్న శివకుమారిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష, లాయర్ శివప్రసాదరావు, మర్రిపల్లి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోముల శేఖర్ రెడ్డి తల్లి మృతి పట్ల సంతాపం : పట్టణంలోని 14వ వార్డుకు చెందిన సోముల శేఖర్ రెడ్డి తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి అఖిలప్రియ దంపతులు శేఖర్ రెడ్డి గృహానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వి జగన్మోహన్ రెడ్డి, బిజెపి తాలూకా ఇంచార్జ్ భూమా కిషోర్ రెడ్డిలు వేర్వేరుగా నివాళులర్పించారు.

మహానందీశ్వరాయలంలో టిడిపి నేతలు

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని మంగళవారం మాజీ మంత్రులు ఏరాసు ప్రతాప్ రెడ్డి, గంటా శ్రీనివాసరావు, సినీ నటుడు అశోక్ కుమార్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వీరికి ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వీరితో స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనాలు చేసి, తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వుల్లి మధు, మండల నాయకులు, మహానంది ఎస్సై నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధికి సహకారమందిస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పాణ్యం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా పనులు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. నిధులు సక్రమంగా వినియోగించుకొని గ్రామాలను అభివృద్ధి బాట పట్టించాలని చెప్పారు. మండలంలోని తమ్మరాజు పల్లె గ్రామంలో జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పాణ్యం చెరువు కట్టపై వున్న ముళ్ళ కంపలను తొలగించాలని ఆయా గ్రామాల సర్పంచులు సమస్యలను లేవనెత్తారు. వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే పశు వైద్య శాలను సందర్శించి సంచార పశువైద్యశాల వాహనాన్ని ప్రారంభించారు. అలాగే లబ్ధిదారులకు ఇళ్ళపట్టాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి హుస్సేన్ బీ, సర్పంచి పల్లవి, జెడ్పిటిసి సరళమ్మ, వైసిపి నాయకులు సూర్య నారాయణ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, చందమామ బాబు, పాలం చంద్ర శేఖర్ రెడ్డి, మేకల సుబ్బారాయుడు, జాకీర్, ఎంపిడిఒ దస్తగిరి, తహశీల్దార్ మల్లికార్జున రెడ్డి, వెటర్నిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించండి

- బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థి నేతలు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని కోరుతూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థి సంఘం నాయకులు మంగళవారం నంద్యాల పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిద్ధార్థ డిఫెన్స్ అకాడమీ కోచింగ్ సెంటర్‌లో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులను కలిసి మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో డాక్టర్ పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ, జిల్లా నాయకులు రాజేష్, బాలు, రామకృష్ణ, నాగన్న, మల్లికార్జున, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న విద్యార్థి నేతలు

ముమ్మరంగా మొక్కజొన్న కోతలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆయా గ్రామాలలో రైతులు సాగు చేసిన రెండవ పంట మొక్కజొన్న కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటకు రూ.1800 నుంచి రూ.2000 దాకా మంచి గిట్టుబాటు ధర పలకడంతో రైతులు రెండవ పంటగా దాదాపు 600 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట కోతదశకు రావడంతో రైతులు యంత్రాల ద్వారా పంటలను కోస్తున్నారు. మొక్కజొన్న పంట క్వింటాలుకు రూ.2000 నుంచి రూ.2,200 ధర పలుకుతుండడంతో రైతులు రోడ్లపై పంటలను ఆరబెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. మొక్కజొన్న పంట ఏడాది ఆశాజనకంగా ఉందని, దిగుబడులు కూడా బాగా వచ్చాయని, గిట్టుబాటు ధర కూడా పలుకుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.





విద్యార్థులకు బస్సు సౌకర్యం కరువు

- అవస్థలు ఎదుర్కొంటున్న గ్రామీణ విద్యార్థులు

మహానంది : కళాశాలలకు, స్కూల్‌కు వెళ్లాలంటే సరైన బస్సు సదుపాయం లేక గ్రామీణ విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో అనేకమంది విద్యార్థులు ప్రతి రోజు నంద్యాలకు విద్యాభ్యాసనకు ప్రయాణం సాగిస్తుంటారు. విద్యార్థులు కళాశాలలకు వెళ్లాలంటే సరైన బస్సు సదుపాయం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మార్కాపురం నుండి నంద్యాల వచ్చే బస్సులలో విద్యార్థులు వెళ్లేవారు. కానీ మంగళవారం ఉదయం మార్కాపురం డిపోకి చెందిన అల్లా పల్లె వెలుగు బస్సులో విద్యార్థులు ఎక్కడానికి ప్రయత్నించగా కండక్టర్ ఇది అల్లాపల్లె వెలుగు బస్సు కాదని, ఎక్స్‌ప్రెస్ అనడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. కాగా విద్యార్థులు తాము ప్రతినిత్యం ఇదే బస్సులో ప్రయాణం చేస్తున్నామని, ఎక్స్ప్రెస్ బస్సుగా ఎలా మార్చారని ప్రశ్నించారు. దీంతో కొద్దిమంది విద్యార్థులను మాత్రమే బస్సులో అనుమతించారు. మిగిలిన విద్యార్థులకు కళాశాల సమయమవుతుందని, బస్సులు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌టిసి ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు తగిన బస్సు సౌకర్యాలను కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పి.నాగిరెడ్డి పల్లికి చేరుకున్న ఉత్సవ పల్లకి

ఆళ్లగడ్డ : అహోబిల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ పల్లకి మంగళవారం బాచాపురం గ్రామం నుంచి పి.నాగిరెడ్డిపల్లికి చేరుకుంది.. దీంతో గ్రామ పెద్దలు ఉత్సవ పల్లకికి ఎదురేగి ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్వాల నరసింహ స్వామి, ప్రహ్లాద వరద స్వాములకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

జిఒ 52ను రద్దు చేయాలి

బనగానపల్లె : గిరిజనుల హక్కులను కాలరాసే జీవో నెంబర్ 52ను రద్దు చేయాలని గిరిజన సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్షులు కాలింగిరి రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు నియమించిన ఏకసభ్య కమిషన్ సభ్యులు శ్యామూల్ కుమార్‌ను కలిసి ఎస్టీ జాబితాలో బోయ, వాల్మీకి, బొంతు ఇతర కులాలను చేర్చవద్దని డోన్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశామన్నారు. జీవో నెంబర్ 52ను వెంటనే రద్దు చేయాలన్నారు. వైసిపి ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిటీ చైర్మన్ ప్రతి జిల్లాలో పర్యటించి గిరిజనుల స్థితిగతులను పర్యటిస్తున్నారని, అందులో భాగంగా డోన్‌కు వచ్చినట్లు తెలిపారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.

టెక్కె దర్గా వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు

అవుకు : అవుకు నుండి కునుకుంట్లకు వెళ్లేదారిలో ఉన్న హజరత్ అపాంశావళి (టక్కె స్వామి) దర్గా వద్ద కునుకుంట్ల గ్రామానికి చెందిన గూడాల సోదరులు మురళీధర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డిలు సిసి కెమెరాలు మంగళవారం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నుండి ఉరుసు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సిసి కెమెరాలను సొంత నిధులతో ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే మూడు లక్షల రూపాయలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు, కరెంటు స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

తాగు నీరు వృధా

జూపాడుబంగ్లా : తంగెడంచ గ్రామ మంచినీటి బావి నుంచి సరఫరా అవుతున్న తాగునీరు వృధా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామంలోని ఎస్సీ కాలనీ, కొత్తపేటలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. 20 రోజులుగా నీరు వృధా అవుతున్నా పట్టించుకోవడం లేదని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానికులు ఎంపీడీవో మంజులావాణికి వినతిపత్రం అందజేశారు.

విద్యుత్ అసిస్టెంట్ లైన్‌మెన్‌కు సన్మానం

ఉయ్యాలవాడ : మండలంలోని అల్లూరు గ్రామంలో విద్యుత్ అసిస్టెంట్ లైన్మెన్‌గా విధులు నిర్వహిస్తున్న సుంకయ్య రిపబ్లిక్ డే దినోత్సవం రోజు జిల్లా అధికారి ఎస్‌ఇ ఉమాపతి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్న సందర్భంగా మంగళవారం ఉయ్యాలవాడలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ గురప్ప, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ప్రతి సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించి ప్రశంస పత్రాలు అందుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సుంకయ్యను సన్మానిస్తున్న సిబ్బంది


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు గంటపోగు ప్రకాష్ అన్నారు. మంగళవారం సిఐటియు జిల్లా నాయకులు రత్నమయ్య, సిఐటియు మండల నాయకులు రాజులు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రాజు మాట్లాడుతూ 13 నెలల నుండి పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని వారి కుటుంబాలు గడవడం కష్టంగా ఉందన్నారు. గ్రామపంచాయతీ నిధులలో పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం జీవో విడుదల చేసిన అమలు కావడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మయ్య, ఖాదర్, బాల్రాజ్, ముని, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల్లో తనిఖీలు చేపట్టాలి

- కొమరంభీమ్ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు ఆశీర్వాధం

ప్రజాశక్తి - శ్రీశైలం

ఎస్సి, ఎస్టి, బిసి గురుకుల పాఠశాల్లో అధికారులు తనిఖీలు చేపట్టాలని కొమరంభీమ్ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు ఆశీర్వాధం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక భగత్ సింగ్ గ్రంథాలయంలో కొమరం భీమ్ గిరిజన గౌరవ అధ్యక్షులు వై ఆశీర్వాదం మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సి, ఎస్టి, బిసి గురుకుల పాఠశాలలో సరైన సదుపాయలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజక వర్గం రామకృష్ణపురంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఫుడ్‌పాయిజన్ కారణంగా 250 మంది బాలికలు అస్వస్థతకు గురయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో వై శీను, పిప బెనహర్, మల్లికార్జున, దితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించండి : డిపిఎంఎ

ప్రజాశక్తి - ఆత్మకూర్

కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రజలలో అవగాహన కల్పించవలసిన బాధ్యత అందరిపై ఉన్నదని డిపిఎంఏ నారాయణ అన్నారు. మంగళవారం ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు కుష్టి వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కుష్టు వ్యాధి నిర్మూలనకు అవసరమైన మందులు ప్రభుత్వ వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని, ప్రాథమిక దశను గుర్తించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించవలసిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉన్నదని ఆయన అన్నారు. సచివాలయ అడ్మిన్లు లక్ష్మీదేవి, సుబ్బలక్ష్మి, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిపిఎంప నారాయణ

మండలాభివృద్ధికి కలిసి పని చేద్దాం : ఎంపిపి

ప్రజాశక్తి - ఆత్మకూర్

మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేద్దామని ఎంపీపీ నల్లకాలువ తిరుపాలమ్మ అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మకూరు మండలం అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు ప్రతి ప్రజా ప్రతినిధి అధికారులను సమన్వయం చేసుకుంటూ పని చేసినప్పుడే మండలం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఆమె అన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ నివేదికలను తమ శాఖ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులకు వివరించారు. ప్రత్యేకించి మండల విద్యాశాఖ అధికారి జానకిరామ్ మాట్లాడుతున్న సందర్భంలో మండల కో ఆప్షన్ సభ్యుడు మౌలాలి జోక్యం చేసుకొని వడ్లరాపురం గ్రామంలో విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి వలసలు వెళు తున్నారని, ఈ వలస నివారించాలని పేర్కొన్నారు. కురుకుంద గ్రామంలో మైనార్టీలు విద్యార్థి సంఖ్య ఎక్కువగా


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన్ కుమార్

ఉన్నదని ఉర్దూ అభ్యసిస్తున్న ఈ విద్యార్థులకు అదనపు టీచర్‌ను కేటాయించాలని గ్రామ సర్పంచ్ ఎంఈఓను కోరారు. ఈ విషయంపై ఉన్నతాధికారితో చర్చించి చర్యలు చేపడతామని ఎంఈఓ జానకిరామ్ తెలిపారు. రాబోవు నీటి ఎద్దడి దృష్టిలో ఉంచుకొని వివిధ గ్రామాలలో తీసుకోవలసిన చర్యలపై ప్రజా ప్రతిని చర్చించి నివేదికలను ఉన్నత అధికారులు పంపిస్తామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీవత్సలా అన్నారు. ఈ సమావేశంలో జడ్పిటిసి సభ్యుడు శివ శంకర్ రెడ్డి, ఎంపిడిఒ మోహన్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, వెలుగు అధికారిని మహేశ్వ రమ్మ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు : నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్యలు రాకుండా చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ పి.కిషోర్‌లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జై కిసాన్ పార్కు నందు మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన కమిషనర్ పి.కిషోర్‌ల ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశంలో రానున్న వేసవి కాలంలో నీటి సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని 1వ వార్డు కౌన్సిలర్ చిన్నరాజు, డిఈఈ నాయబ్ రసూల్ తెలియజేయడంతో తగుచర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిలర్‌లు వార్డుల సమస్యలను చైర్మన్, కమిషనర్‌ల దృష్టికి తీసుకొని రావడం జరిగింది. అనంతరం మారుతి నగర్ ఏబిఎమ్ సంఘస్తులు, చర్చి స్థలం కొరకై వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ శ్రీమతి అర్షపోగు ప్రశాంతి, కో-ఆప్షన్ సభ్యులు అబ్దుల్ గఫార్, కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో పన్నుల భారం : టిడిపి

ప్రజాశక్తి - డోన్

వైసిపి ప్రభుత్వంలో వ్యాపారస్తులు పన్నుల భారంతో ఇబ్బందులకు గురవుతున్నారని డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం డోన్ పట్టణంలో రాజా టాకీస్ ఏరియాలో 25,26 వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ధర్మవరం సుబ్బారెడ్డి హాజరయ్యారు. టిడిపి నాయకులతో కలసి వైసిపి దుర్మార్గమైన పాలనను ప్రజలకు వివరిస్తూ ప్రజల సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చాక మూడున్నర ఏళ్లలో ఏడుసార్లు విద్యుత్ బిల్లులు పెంపు చేసి ట్రూ అప్ చార్జీల బాదుడుతో వ్యాపారస్తు లను, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు పవర్ హాలిడేస్ తప్పనిసరి చేసి పరిశ్రమలన్నీ వ్యాపారస్తులను రోడ్డు పాలు చేశారని


ప్రజలకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్న డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

అన్నారు. వ్యాపా రస్తులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులను చూస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి వలసల రామకృష్ణ, డోన్ నియోజక వర్గ టిడిపి సలహాదారుల కమిటీ అధ్యక్షులు మురళీకృష్ణ గౌడ్, నంద్యాల జిల్లా టిడిపి అధికార ప్రతినిధి విజయ్ భట్, నంద్యాల జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లిఖార్జున, జిల్లా టిడిపి టిఎన్‌టియుసి అధ్యక్షులు అజీజ్, డోన్ నియోజకవర్గ టిడిపి యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, జిల్లా టిడిపి కార్యదర్శి అబ్బిరెడ్డిపల్లె గోవిందు,నంద్యాల జిల్లా టిడిపి రైతు కమిటీ కార్యదర్శి జలదుర్గం విష్ణు, డోన్ మండల టిడిపి ఉపాధ్యక్షులు మిద్దపల్లె గోవిందు,డోన్ పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు మర్రి ఉపేంద్ర,యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, గోవింద రెడ్డి,డోన్ మండలం టిడిపి బిసి సెల్ అధ్యక్షులు రామాంజనేయులు,డోన్ మండలం తెలుగు యువత అధ్యక్షులు కోనేటి కాశీ విశ్వనాథ్,డోన్ పట్టణ టిడిపి మైనారిటీ కమిటీ ప్రదానకార్యదర్శి అలీబాబా,తెలుగు యువత కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్ రెడ్డి,పట్టణ టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి నీలం ప్రభాకర్,ఉడుములపాడు నాగేంద్ర, డోన్ పట్టణ టిడిపి బిసి సెల్ ఉపాధ్యక్షుడు జిలేబి ధను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : వైసిపి

ప్రజాశక్తి - డోన్

గ్రామాలను అభివృద్ధి చేయడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం డోన్ మండలంలోని కొచ్చెరువు గ్రామంలో రూ.23 లక్షల అంచనా వ్యయంతో 40 వేల లీటర్ల వాటర్ ట్యాంక్‌కి ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డోన్ ఎంపీపీ కమలాపురం రేగటి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆశీస్సులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాలలో గత ప్రభుత్వాల హాయంలో జరగనటువంటి అభివృద్ధి పనులను వైసిపి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేయుటకు త్వరితగతిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీ శ్రీనివాసులు, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ.సతీష్, జడ్పిటిసి బద్దల రాజ్ కుమార్ యాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, మల్లెంపల్లె రామ చంద్రుడు, గ్రామ సర్పంచ్ ఎం.మంజుల,ఉప సర్పంచ్ బి.మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ కె.లక్ష్మీ నారాయణ, టి.రమణయ్య శెట్టి, డి.కృష్ణా రెడ్డి, ఇ.మహేశ్వర్ రెడ్డి,చింతలపేట గంగాధర్ రెడ్డి, కె.నాగేశ్వరరావు,ఎన్.బారప్ప, డి.పేర్, కెపి.రాజు, పి.నాయుడు, వి.పాపన్న, జి. సాంబశివుడు పాల్గొన్నారు.



బేతంచెర్ల : మండలంలోని ప్రతి గ్రామాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో ఆదర్శంగా తీర్చిదిద్దామని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి అన్నారు. మంగళవారం హెచ్ కొట్టాల గ్రామంలో డిఎంఎఫ్ రూ.15 లక్షల నిధులతో హెచ్ కొటాల గ్రామం పరిధిలోని పంట పొలాలకు వెళ్లే రహదారికి హెచ్ కొట్టాల గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగభూషణం రెడ్డి, చైర్మన్ చలం రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా నిధులను విడుదల చేసి అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు మూర్తి జావలి, సింగిల్ విండో అధ్యక్షుడు రుద్రవరం నారాయణ, మాజీ వైస్ ప్రెసిడెంట్ కాజా హుస్సేన్, తిరుమలేష్ రెడ్డి, వెంకటేశ్వర్లు, మధు, ఎద్దులన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.


పెళ్లి కుమారులను దీవిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, తదితరులు

వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

నంద్యాల పార్లమెంట్ టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా కుమారుల రిసెప్షన్ వేడుకలు మంగళవారం స్థానిక ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసి జనార్దన్ రెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి హాజరై పెళ్లి కుమారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జీవో 1ని రద్దు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - నందికొట్కూరు


మాట్లాడుతున్న కెవిపిఎస్ నేతలు

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 1ను వెంటనే రద్దు చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షురాలు కే రంగమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం బైరెడ్డి నగర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారులు వీధుల్లో సమావేశాలు, ర్యాలీలు, సభలు నిర్వహించకూడదని జీవో తేవడం ప్రజాస్వామికులపై నిర్బంధంగా ఉందన్నారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆరు జయ, ఎస్‌బిబి, కెవిపిఎస్ మహిళలు పాల్గొన్నారు.

15 వరకు ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించే గడువు ఈనెల 15 తేదీలోపు చెల్లించవచ్చని బేతంచెర్ల మండల కేంద్రం లోని శ్రీ భాగ్యదయ హైస్కూల్ చైర్మన్ కానాల నాగలక్ష్మి దేవి తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యదయ చైర్మన్ కానాల నాగ లక్ష్మీదేవి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ఓపెన్ స్కూల్లో పదవ తరగతి ఇంటర్మీడియట్‌లో చేరిన విద్యార్థులు గతంలో 10 ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఏపీ ఆన్లైన్ మీ సేవ ద్వారా ఫీజులు చెల్లించవచ్చన్నారు. ఫీజుల వివరాలు ఈనెల 16వ తేదీ నుండి 22వ తేదీ వరకు రూ.25 అపరాధ రుసుముతో, 23వ తేదీ నుండి మార్చి రెండవ తేదీ వరకు రూ.50 ఫైన్‌తో ఫీజులు చెల్లించవ చ్చున్నారు.

యూత్ ఫర్ యాంటీ కరప్షన్ జిల్లా సెక్రెటరీగా

బొల్లు ప్రసాద్ బాబు యాదవ్

ప్రజాశక్తి - కొత్తపల్లి



యూత్ ఫర్ యాంటీ కరప్షన్ జిల్లా సెక్రెటరీగా కొత్తపల్లి మండలం పెద్ద గుమ్మడ పురం గ్రామానికి చెందిన బొల్లు ప్రసాద్ బాబు యాదవ్ ఎంపికయ్యారు. కర్నూలు జిల్లాలో రాయలసీమ రీజినల్ అడ్వైజర్ కే వేణుగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా సెక్రెటరీగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన జిల్లా సెక్రెటరీ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కృషి చేస్తానన్నారు. సమాజంలో పెరిగిపోతున్న అవినీతి అక్రమాలను అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు. సమాజంలో ఉన్న మేధావుల సలహాలతో పనిచేస్తానన్నారు. యాంటీ ఫర్ కరప్షన్ రాబోవు తరాలకు ఎంతో బాసటగా అలాగే నిజాయితీ గల అధికారులకు వెన్నుదన్నుగా ఉంటుందని తెలిపారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వెలుగోడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని లక్ష్మి నగర్, ఎస్‌సి కాలనీ ప్రాంతాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు. మంగళవారం ఆయన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి గడప తిరుగుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వార్డులలో సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు దేశం తిరుపం రెడ్డి అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, వెలుగోడు సర్పంచ్ జయపాల్, మండల ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి కాంట్రాక్టర్, లాడెన్ ఖాదర్ వలి, మదీనా షంషీర్, అడ్వకేట్ ఆసిఫ్ అలి ఖాన్, ఎంపీటీసీ చాంద్ బాష, తదితరులు పాల్గొన్నారు.


పథకాల బుక్‌లెట్‌ను మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

'పది'లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

- సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చింతామణి

ప్రజాశక్తి - పాములపాడు

పదవ తరగతిలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని డిఎస్‌సిడబ్ల్యూఓ అండ్ ఈవో (సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్) చింతామణి సూచించారు. మంగళవారం పాములపాడు సాంఘిక సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో పగిడ్యాల, పాములపాడు, జూపాడు బంగ్లా, వేలుపనూరు, మిడుతూరు, వెంకటాపురం, మండలాలకు చెందిన ఎస్సీ వసతి గృహంలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పదవ తరగతి పాస్ అయ్యేందుకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి విద్యార్థి చదవవలసిన తీరు పట్ల సబ్జెక్టుల వారిగా సులువ బోధన పద్ధతిలో విద్యార్థినిలకు సబ్జెక్టు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఓ వైవి సుబ్బారెడ్డి, హెచ్‌డబ్ల్యూఓలు ఎన్ ఉమాదేవి, అనిత, అంకన్న, రవికుమార్, రాజు, అమని బాయ్ పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ చింతామణి

సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపిపి

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండలంలోని ఆయా గ్రామాలలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపిపి నాయక్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నాయక్ దిల్షాద్ ముజఫర్ హుస్సేన్, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు జరగాల్సిన ముఖ్యమైన పనులను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ మొహిద్దిన్, హౌసింగ్ ఏఈ అహ్మద్ భాషా, పిఐపిఆర్‌డి సాల్మన్ రాజ్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

బెస్త రాజుపై దాడి చేసిన వారిని శిక్షించాలి : ప్రజా సంఘాలు

గప్రజాశక్తి - నందికొట్కూరు


మండలంలోని కొణిదెల గ్రామానికి చెందిన రైతు సంఘం జిల్లా నాయకులు బెస్త రాజుపై దాడి చేసి అవమానపరిచిన చల్ల సంజీవరెడ్డిపై వెంటనే కేసు నమోదు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి పి పకీర్ సాహెబ్, సిఐటియు జిల్లా నాయకులు టి.గోపాలకృష్ణ, కే మదిలేటి, వ్యకాసం జిల్లా నాయకులు వేణుగోపాల్ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులం పేరుతో నోటికొచ్చి నట్టు తిడుతూ ప్రక్కన ఉన్న సెంట్రింగ్ కర్రతో దాడికి ప్రయత్నించడం దారుణం అన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చ రించారు. వ్యకాసం నాయకులు కే వెంకటేశ్వర్లు, శివ, రైతు సంఘం నాయకులు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

క్రీడాకారుడికి శాప్ చైర్మన్ ఆర్థికసాయం

ప్రజాశక్తి - నందికొట్కూరు

శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు సీ.పవన్ కుమార్ ఇటీవల నందికొట్కూరులో నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్‌లో ఆడుతూ కాలికి తీవ్ర గాయాలతో కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాడు. నిరుపేద కుటుంబానికి చెందిన పవన్ కుమార్ నంద్యాలలో ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కాలేజీలో ఫైనల్ ఇయర్ (ఈ.సీ.ఈ) ఇంజనీరింగ్ చదువుతున్నాడు. వారి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆసుపత్రిలో నాణ్యమైన చికిత్స, శస్త్ర చికిత్స నిమిత్తం లక్ష రూపాయలు ఆర్థిక సహాయంను మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ రమేష్ నాయుడు, కర్నూలు జిల్లా శాప్ కో- ఆర్డినేటర్ శ్రీనాథ్ పెరుమాళ్ళ ద్వారా అందజేశారు. తమ కుమారునికి ఆర్థిక సహాయం అందించిన శాప్ చైర్మన్ తల్లి, తండ్రులు మద్దిలేటి, లక్ష్మీ దేవమ్మ, సోదరుడు కిషోర్ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ శాప్ చైర్మన్ గొప్ప మనసుకు ధన్యావాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ వీరన్న, క్రీడా అభిమాని పీతాంబర రెడ్డి, పగిడాల మండల కో ఆప్షన్ సభ్యులు అస్లాం బాష, వైస్ ఎంపీపీ బోరెల్లి శ్యామల నారాయణ, జడ్పిహెచ్ఎస్ ప్రాతకోట పేరెంట్స్ కమిటీ చైర్మన్ శిలార్ సాహెబ్, కొత్తపల్లి మండల వైస్ ఎంపిపి సింగారం రంగా, సీనియర్ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బీరవోలు వెంకటేశ్వర్లు పుట్టా వెంకట రమణ మిద్దె మోక్షం, పుట్టా రమణ ప్రసాద్, కురువ మల్లయ్య, కురుమన్న తదితరులు పాల్గొన్నారు.


గాయపడిని క్రీడాకారుడికి ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు

వ్యక్తి అదృశం

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని సంకిరేణిపల్లే గ్రామానికి చేందిన మునిస్వామి అనే వ్యక్తి అదృశం మైనట్లు ముచ్చుమర్రి ఎస్ఐ నాగర్జున మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. మునిస్వామి అనే వ్యక్తం నీటిపారుదల శాఖలో లష్కర్‌గా పెసరవాయిలో విదులు నిర్వహిస్తుంటా డు. ఈ నెల 16వ తేదిన విదులను వెళ్లా మునిస్వామి ఇంతవరకు రాలేదని మునిస్వామి అన్న ఓబులేసు తెలిపారన్నారు. మునిస్వామికి ఫిడ్స్ వస్తుందని దీకి తోడు మద్యం సేవిస్తరన్నారు. అన్న ఓబులేసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విధులకు సక్రమంగా హాజరవ్వాలి

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆయా అంగన్వాడీ కేంద్రాలలో సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని సూపర్వైజర్ లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని చిత్రేనిపల్లె గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణి, బాలింతలకు ఇస్తున్న పౌష్టిక ఆహారం సంబంధించిన రికార్డులను, స్టాకును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నడపాలన్నారు. పౌష్టికాహారాన్ని ఎవరైనా దుర్వినియోగం చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పౌష్టికాహారాన్ని పరిశుభ్రంగా వడ్డించాలన్నారు. తనిఖీల్లో కార్యదర్శి శివకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని వేంపెంట గ్రామంలో హౌసింగ్ లబ్ధిదారులకు తహశీల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో సుమిత్రమ్మ, హౌసింగ్ ఏఈ శివరామకృష్ణారెడ్డి హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాన్ని సర్పంచ్ మాణిక్యమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. లబ్ధిదారులు తమ గృహాలను త్వరగా నిర్మించుకోవా లని తెలిపారు. సకాలంలో నిర్మించుకున్న వారికి బిల్లులు త్వరగా పడేవిధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సచివాలయ ఇబ్బంది, వాలంటీరీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

దళితులు హక్కులపై అవగాహన కలిగుండాల ని ఎంపిడిఒ వెంకటరమణ, తహశీల్దార్ భారతి అన్నారు. మంగళవారం మండలంలోని పడమర ప్రాతకొట గ్రామంలోని దళిత కాలనీలో దళితుకు హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ అదించే పథకాలు హక్కుల గురించి వివరించారు. జిఎన్ఆర్ఎస్ ట్యాంకు పునరుద్ధించాలని డ్రైనేజి కాల్వను ఎత్తు పెంచాలని కాలని వాసులు అధికారులను కోరాగా చర్యలు తీసుకోవాలని సర్పంచు శేషమ్మ, కార్యదర్శికి సమతయోశోదరకు వారు సూచించారు. అనంతరం గృహ నిర్మాణలపై వాలంటీర్లతో సచివాలయంలో సమీక్ష నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


కాలని వాసులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మినుములో తెగుళ్ల పట్ల జాగ్రత్త తీసుకోవాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మినుము పంటలు సాగు చేస్తున్న రైతులు పంటలో వస్తున్న తెగుళ్లపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత తెలిపారు. మంగళవారం కొత్తపల్లి మండలంలోని నందికుంట గ్రామంలో మండల వ్యవసాయ అధికారి మహేష్ అధ్యక్షతన వైయస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు మినుము పంటలో వచ్చే చీడపీడల యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు శివ కృష్ణ నాయక్, జహీద్, శేషు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పశువైద్యశాల మరమ్మతులకు నిధులు మంజూరు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామంలో ఉన్న పశువైద్యశాల మరమ్మతుల కోసం మండల అభివృద్ధి నిధుల నుంచి రూ.3.50 లక్షలు మంజూరు చేసినట్లు పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మంజూరైన నిధులతో పశు వైద్యశాలలో అన్ని సదుపాయాలను కల్పించాలని అధికారులకు సూచించారు. రైతులకు అన్ని సదుపాయాలతో పశువైద్యశాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

రుద్రవరం అటవీ రేంజ్‌లో ఫైర్‌లైన్స్ ఏర్పాటు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలోని 5 ఫారెస్ట్ సెక్షన్లలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక ఫారెస్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డి.వనిపెంట, అహోబిలం నూతల నార్త్, ఆలమూరు, రుద్రవరం అటవీ సెక్షన్లలో 3 మీటర్ల వెడల్పుతో 1.50 కిలోమీటర్ పొడవున ఫైర్ లైన్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నల్లమల అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్‌లైన్స్ ఎంతో ఉపయోగపడతా యన్నారు. అడవుల్లోకి ఫారెస్ట్ అధికారుల అనుమతి లేకుండా ఎవరు వెళ్లకూడదన్నారు. ఎవరైనా అడవులకు నిప్పు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టి కేసులో డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - శిరివెళ్ల

మేజర్ పంచాయతీ వెంకటేశ్వరపురం గ్రామంలో బాధిత ఏసన్న నివాసం వద్ద ఎస్‌సి, ఎస్‌టి కేసుపై డిఎస్పి రామాంజనేయ మంగళవారం విచారణ జరిపారు. కొన్ని నెలల క్రితం దళిత కుటుంబానికి చెందిన రైతు ఏసన్న నుండి వెంకటాపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర రెడ్డి 400 బస్తాలు వరి ధాన్యం స్వాధీనం చేసుకుని డబ్బులు ఇవ్వలేదన్న సంఘటనపై విచారించినట్లు డిఎస్‌పి తెలిపారు. దళారి వెంకటేశ్వర్ రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని, ధాన్యం తీసుకొని ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా దౌర్జన్యం చేస్తూ మానసికంగా, ఆర్థికంగా కష్టాలకు గురి చేసినట్లు డిఎస్‌పి ఎదుట బాధిత కుటుంబ సభ్యులు మొరపెట్టుకున్నారు. బాధిత కుటుంబ సభ్యుల వాంగ్మూలాన్ని వీడియో తీసి ధాన్యం వివరాల సేకరణకు వీర హౌస్ గోడౌన్ వద్దకు సైతం డిఎస్‌పి వెళ్లి విచారణ జరిపారు.


విచారిస్తున్న డిఎస్‌పి